ANN తెలుగు

Follow: @ANNTELUGU

20-05-2025

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 167 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## జూన్ 30లోగా నివేదిక ఇవ్వండి

### గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం హెచ్ఆర్సీ సీరియస్

ఘటనపై సుమోటోగా కేసు విచారణకు కమిషన్ చైర్మన్ ఆదేశం

సీఎస్‌తో పాటు పలువురికి నోటీసులు జారీ

**హైదరాబాద్, మహా:** పాతబస్తీలో గుల్జార్ హౌస్ ఘోర అగ్ని ప్రమాదంపై హెచ్ఆర్సీ సీరియస్ అయ్యింది. ఈ ప్రమాద ఘటనపై సుమోటోగా కేసు విచారణకు కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అఖ్తర్ ఆదేశించారు. భవన భద్రత , విద్యుత్ నిర్వహణ, అగ్నిప్రమాద నివారణ పరమైన నిబంధనలు పాటించలేదంటూ మీడియాలో వస్తున్న పలు కథనాలపై

మిగతా 2లో


టాప్ న్యూస్



### శిల్పా శిరోద్కర్‌కు కొవిడ్

సోషల్ మీడియాలో పోస్ట్!

08



### మనం ఎన్ని విమానాలు కోల్పోయాం?

- పాక్‌కు ఆపరేషన్ సిందూర్ సమాచారం ఎందుకిచ్చాం
- ఇది తప్పిదం కాదు.. నేరం దేశానికి నిజం తెలియాలి
- ఎక్స్ ఎంపీ రాహుల్ గాంధీ సంచలన ట్వీట్

02



### కిషన్ రెడ్డి.. గల్లీ లీడర్ లా మాట్లాడొద్దు

- విమర్శలు మాని ప్రజలకు సర్వీస్ చేయ్
- చర్లపల్లి రైల్వే స్టేషన్ ఈదురు గాలికే రేకులు పడిపోలేదా..?
- హైదరాబాద్ ఘటనపై మీ వ్యవహార శైలి సరికాదు
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

03



### ప్రెస్ క్లబ్‌లో ఐఎన్టీయుసీ నాయకుల ఫైటింగ్

ఒకరిపై మరొకరు పిడిగుద్దులు

వివరాలు 3లో




### రాష్ట్రంలో 77 మంది డిఎస్పీల బదిలీలు

ఉత్తర్వులు జారీచేసిన డీజీపీ జితేందర్

వివరాలు 2లో



### ఎల్‌వోపీ కోసం హరీశ్ రావు ఫైట్

- బీఆర్ఎస్ అంటే బాపు, బేటా, భేటీ, బతీజా రాష్ట్ర సమితి
- కేటీఆర్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించే అవకాశం
- అందుకే ప్రతిపక్ష హోదా కోసం హరీశ్ కుస్తీ
- మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి

వివరాలు 3లో



### భారత్ ఏమైనా ధర్మసత్రమా?

- శరణార్థులకు ఆశ్రయం ఇవ్వలేం: సుప్రీం
- శ్రీలంక శరణార్థి అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు
- భారత్ ప్రపంచ శరణార్థులకు ధర్మశాల కాదని స్పష్టం
- 140 కోట్ల జనాభాతో మేమే సతమతమవుతున్నామన్న జస్టిస్ దత్తా
- ఆర్టికల్ 19 హక్కులు కేవలం భారత పౌరులకేనని ఉద్ఘాటన

వివరాలు 3లో



# రైతులందరికీ సోలార్ పంపుసెట్లు

## సోలార్ విద్యుత్‌తో ఆదాయం వచ్చేలా చేస్తా

- పండిన సన్నబియ్యం ప్రతి పేదవాడికీ అందిస్తున్నాం
- దేశంలో తెలంగాణ నంబర్ వన్‌గా మార్చినం
- వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ఘనత మా సర్కార్‌దే
- వరి వేస్తే ఉరే అనే పరిస్థితుల నుంచి.. వరి వేస్తే సిరి అనే పరిస్థితులు తెచ్చాం
- రాష్ట్రంలోని ఆ ఐదారుగురు సన్నాసుల గురించి పట్టించుకోను
- అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలకు ప్రోత్సాహం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని ప్రారంభించిన సీఎం
- 'నల్లమల డిక్లరేషన్'ను ఆవిష్కరించిన ముఖ్య మంత్రి
- గిరిజన సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు
- 20 ఏళ్లు అధికారంలో కాంగ్రెస్: భట్టి విక్రమార్క
- పోడు భూములకు జలకళ : మంత్రి సీతక్క

**నాగర్ కర్నూల్, మహా:** నల్లమల ప్రాంత సమగ్రాభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇదే వేదికపై 'నల్లమల డిక్లరేషన్'ను కూడా ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి, నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో అభివృద్ధి పనులు చేపడతామని ప్రకటించారు. ఒకప్పుడు వెనుకబాటుకు నిలయంగా ఉన్న నల్లమల ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి హోదాలో మాట్లాడటం గర్వకారణంగా ఉందని, తన గుండె ఉప్పొంగిపోతోందని ఆయన అన్నారు. తాను పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని సగర్వంగా చెప్పుకుంటానని, కాంగ్రెస్ పార్టీని ఆదరించిన ఈ ప్రాంత ప్రజల రుణం తీర్చుకుంటానని స్పష్టం చేశారు. పోడు భూములపై పోరాటం చేసిన వారిని జైల్లో పెట్టిన చరిత్ర గత ప్రభుత్వానివని, పోడు భూముల్లో సోలార్ పంపుసెట్లను అందించి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిది.. అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

మిగతా 2లో

# ఇద్దరు కాదు.. ఆరుగురు

### ఇన్ స్టా గ్రూప్ క్రియేట్.. అందులోనే బ్లాస్టింగ్ పాఠాలు

విజయనగరం వేదికగా పేలుళ్ళ రిహార్సల్ ప్లాన్

హైదరాబాద్ లో బాంబుపేలుళ్ళకు స్కెచ్



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ లో బాంబు పేలుళ్ళకు సంబంధించి ఉగ్రవాదుల కుట్రను పోలీసులు భగ్నం చేశారు. విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, హైదరాబాద్ బోయిగూడకు చెందిన సయ్యద్ సమీర్‌ను అరెస్ట్ చేశారు. వీరిద్దరూ విజయనగరం వేదికగా బాంబు పేలుళ్ల రిహార్సల్స్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఉగ్ర కుట్ర భగ్నం కేసులో పోలీసులు జోరు పెంచారు. ఈ మేరకు కీలక నిందితులు సిరాజ్, సమీర్ సయ్యద్‌లను తమ కస్టడీలోకి ఇవ్వాలంటూ పోలీసులు సోమవారం విజయనగరం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ఆ పిటిషన్‌ను స్వీకరించిన కోర్టు విచారణ చేపట్టింది. వాదనల సందర్భంగా ఆ ఇద్దరిని కస్టడీకి ఇస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీసులు న్యాయమూర్తికి వివరించారు.

మిగతా 2లో

# డిక్లరేషన్ల పేరిట డంబాచారం

### అమలు చేస్తామన్న రైతు డిక్లరేషన్ ఆగమైంది

- బీరాలు పలికిన బీసీ డిక్లరేషన్ దిక్కే లేకపాయే
- రేవంత్ ఆరు గ్యారెంటీల ఊసెత్తడమే మానేసిండు
- మీ ప్రసంగంలో ఆవేశం తప్ప, కంటెంట్ లేదు.. కాంటెస్ట్ లేదు
- ఎక్స్ వేదికగా మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు



**హైదరాబాద్, మహా:** తాను నల్లమల బిడ్డనని గొప్పలు చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి తనను కలుసుకోవడానికి వచ్చిన అమాయక చెంచు బిడ్డలను అరెస్టు చేసి తన నిరంకుశ నైజాన్ని మరోసారి బయటపెట్టుకున్నాడని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆర్భాటంగా డిక్లరేషన్లు ప్రకటించడమే తప్ప.. అమలు చేసే డెడికేషన్ మాత్రం అస్సలు లేదని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎక్స్ వేదికగా కామెంట్స్ చేశారు.

మిగతా 3లో

# రూ.35 కోట్లు సరిపోతాయా?


### అందాల పోటీలకు రూ.300 కోట్లు కేటాయిస్తారు

- సరస్వతి పుష్కరాలకు రూ.35కోట్లు మాత్రమేనా?
- అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ సరస్వతి పుష్కరాలపై లేదా?
- పుష్కరాల నిర్వహణలో రేవంత్ సర్కార్ విఫలమవుతోంది
- మేము అధికారంలో ఉంటే పుష్కరాలను పండుగగా నిర్వహించే వాళ్లం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- త్రివేణి సంగమం వద్ద పుష్కర స్నానం ఆచరించిన బండి సంజయ్

**భూపాలపల్లి, మహా:** కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు రూ.35 కోట్లు మాత్రమే కేటాయించారని, ఆ నిధులు ఏ మూలకు సరిపోతాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ సరస్వతి పుష్కరాల నిర్వహణపై లేకుండా పోయిందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో మహాకుంభమేళా సందర్భంగా 50 కోట్ల మంది భక్తులకు తమ ప్రభుత్వం అద్భుతమైన ఆతిథ్యం ఇచ్చిందని, కాళేశ్వరం పుష్కరాలకు విచ్చేసే 50 లక్షల మందికి రేవంత్ ప్రభుత్వం సరైన ఆతిథ్యం ఇవ్వలేకపోతోందని అసహనం వ్యక్తం చేశారు.

మిగతా 3లో





### మళ్లీ పొడిగింపు..

- కాళేశ్వరం కమిషన్ విచారణ గడువు పెంపు
- మరో 2 నెలలు పొడిగించిన ప్రభుత్వం
- నేతల విచారణ కోసమే తాజాగా పొడిగింపు
- కేసీఆర్, హరీశ్, ఈటలను విచారణకు పిలిచే ఆలోచనలో కమిషన్!

03





# రైతులందరికీ సోలార్ పంపుసెట్లు

(మొదటిపేజీ తరువాయి)

'ఈ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎన్నికల సమయంలో మాట ఇచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం మీ బిడ్డగా నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఆ దిశగా అధికారులకు సూచనలు చేశా. అచ్చంపేట నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం. ఇందుకు అవసరమైన నిధులు ఇచ్చే బాధ్యత నేను తీసుకుంటా. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. రూ. 60 వేల కోట్లు రైతుల కోసం ఖర్చు చేసింది. సన్నాలు పండించే రైతులకు మద్దతు ధరతోపాటు రూ. 500 బోనస్ అందిస్తున్నాం. వరి వేస్తే ఉరే అనే పరిస్థితుల నుంచి.. వరి వేస్తే సిరి అనే పరిస్థితులు కల్పించాం. పేదలందరికీ సన్న బియ్యం అందించి వారి ఆత్మగౌరవం పెంచాం. రాష్ట్రంలో 3 కోట్ల 10 లక్షల మంది పేదలకు సన్న బియ్యం అందిస్తున్నాం. 50 లక్షల పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం. వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించాం. అదానీ, అంబానీలతో పోటీ పడేలా ఆడబిడ్డలకు ప్రోత్సాహం అందిస్తున్నాం' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.


**ప్రణాళికతో ముందుకెళ్తున్నాం..**

'ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టాలని ప్రణాళికలు రూపొందిస్తూ ముందుకు వెళుతున్నాం. తెలంగాణను దేశంలోనే ధనిక రాష్ట్రంగా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకుంటున్నాం. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏడాదిలో 60 వేల ఉద్యోగ నియామకాలను చేపట్టాం. నిత్యావసర ధరలను నియంత్రించి పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చిన నెంబర్ వన్ రాష్ట్రం తెలంగాణ అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. శాంతిభద్రతల పరిరక్షణలోనూ తెలంగాణ నెంబర్ వన్ గా నిలిచింది. పాలమూరోల్లకు పాలన చేతకాదన్న వాళ్లకు.. తెలంగాణను నెంబర్ వన్‌గా నిలబెట్టగలమని నిరూపించాం. ఎంతోమంది ప్రధానులు అయినా.. ప్రతీ తండాలో.. పేదవాడి గుండెల్లో నిలిచిపోయింది మాత్రం ఇందిరమ్మ మాత్రమే. మీ భూమికి హక్కు ఇవ్వడమే కాదు.. మీ భూముల్లో సోలార్ పంపు సెట్లతో సాగు చేసుకునేలా నల్లమల బిడ్డగా నేను బాధ్యత తీసుకున్నా. కొంతమంది తమ అక్రమ సంపాదనతో.. సోషల్ మీడియాలో మనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కడుపునిండా విషం పెట్టుకుని మనపై విష ప్రచారం చేసే వారిని నేను పట్టించుకోను. ఎవరెన్ని తప్పుడు ప్రచారాలు చేసినా.. మన పథకాలే ప్రజలకు నిజాలను చెబుతాయి. మనపై తప్పుడు ప్రచారం చేసేవారికి ప్రజలే బుద్ధి చెబుతారు' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

**తూచా తప్పక పాటించి..**

తెలంగాణ గడ్డపై దశాబ్దాలుగా ఉన్న దున్నేవానికి భూమి నినాదాన్ని ఇందిరా సౌర గిరి జిల్లా వికాసం వంటి పథకాల ద్వారా చట్టాలుగా అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. తెలంగాణ గడ్డపై ఉన్న జల్, జంగల్, జమీన్, భూమి కోసం, భుక్తి కోసం పోరాటం వంటి నినాదాలు చట్టాలుగా మారాలంటే రాష్ట్రంలో మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండాలి అన్నారు. ఈరోజు రేవంత్ రెడ్డి నాయకత్వంలో తీసుకువచ్చిన నల్లమల డిక్లరేషన్‌తో రాష్ట్రంలోని అన్ని గిరిజన ప్రాంతాలకు ప్రయోజనం చేకూరుతుందని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. నల్లమల డిక్లరేషన్‌ను తూచా తప్పక పాటించి నాలుగు సంవత్సరాల్లో ఈ రాష్ట్ర గిరిజనులకు ఫలితాలు అందిస్తాం అన్నారు. రాష్ట్ర ప్రజల పైన అపారమైన ప్రేమ తరతరాలుగా వెనుకబడ్డ బిడ్డలకు మేలు చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనతో నల్లమల డిక్లరేషన్ ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ఏమి పొందలేక దూరంగా ఉన్న గిరిజన బిడ్డలకు 12,600 కోట్లతో పథకాన్ని ప్రారంభించడం ఓ గొప్ప సాహసంగా డిప్యూటీ సీఎం అభివర్ణించారు. జూన్ 2న గిరిజన యువతకు రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకం ద్వారా 1000 కోట్లు మంజూరు చేయబోతున్నట్టు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల కోసం తీసుకొచ్చిన 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని సీఎం రేవంత్ ప్రారంభించడం ఆనందంగా ఉందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణలో అటవీ హక్కుల చట్టం కింద 6.69 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములకు పోడు పట్టాలు మంజూరైన నేపథ్యంలో బీడు వారుతున్న పోడు భూములకు జలకళను తెచ్చేందుకే సర్కార్ 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఆదివాసీలు ప్రత్యేక గిరిజన చట్టాలను వినియోగించుకోవాలని, త్వరలో ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో మాదిరిగానే గిరిజన ప్రాంతాల వారికి ప్రత్యేక ఉద్యోగాలు అందించే ప్రయత్నం చేస్తామని మంత్రి సీతక్క చెప్పారు.





# రాష్ట్రంలో 77మంది డీఎస్పీల బదిలీలు

## ఉత్తర్వులు జారీచేసిన డీజీపీ జితేందర్

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో పెద్ద ఎత్తున పోలీసు బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 77 మంది డీఎస్పీలు, ఏసీపీలను బదిలీ చేశారు. అలాగే మరి కొంతమందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు సోమవారం డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. కొందరికి కొత్త బాధ్యతలు అప్పగించగా, మరికొందరిని డీజీపీ కార్యాలయానికి హాజరు కావాలని ఆదేశించారు.

1. నల్లా వెంకటస్వామి - రామగుండం సీసీఎస్‌లో ఏసీపీగా ఉన్నారు. ఇప్పుడు జగిత్యాల ఎస్‌డీపీఓగా బదిలీ అయ్యారు.
2. డీ. రఘుచందర్ - జగిత్యాల ఎస్‌డీపీఓగా ఉన్నారు. ఇప్పుడు ఇంటలిజెన్స్ విభాగానికి డీఎస్పీగా వెళ్లారు.
3. పీ. నరేష్ రెడ్డి - ఇంటలిజెన్స్ డీఎస్పీగా ఉన్నారు. ఇప్పుడు బాలానగర్ (సైబరాబాద్) ఏసీపీగా నియమితులయ్యారు.
4. వీ. శ్రీకాంత్ గౌడ్ - రాచకొండ ఎస్ఓటీ ఏసీపీగా ఉన్నారు. ఇప్పుడు శంషాబాద్ ఏసీపీగా మారారు.
5. చల్లా శ్రీధర్ - ఇంటలిజెన్స్ డీఎస్పీగా ఉన్నారు. మాధాపూర్ ఏసీపీగా బాధ్యతలు చేపడతారు.
6. చల్లా శ్రీకాంత్ - మాధాపూర్ ఏసీపీగా ఉన్నారు. చిక్కడపల్లి ఏసీపీగా మారారు.
7. ఎల్. రమేష్ కుమార్ - చిక్కడపల్లి ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.
8. చల్లా శంకర్ రెడ్డి - సీసీఆర్‌బీ నుంచి మెద్చల్ ఏసీపీగా బదిలీ అయ్యారు.
9. బీ. శ్రీనివాస్ రెడ్డి - మెద్చల్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలి.
10. టీ. సుఖదేవ్ సింగ్ - సంతోష్‌నగర్ ఏసీపీగా నియమితులయ్యారు.
11. మొహమ్మద్ ఘౌస్ - సంతోష్‌నగర్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
12. శ్రీనివాస రావు సుంకర - సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీగా ఉన్నారు. ఎల్లారెడ్డి ఎస్‌డీపీఓగా మారారు.
13. కే సుబ్బ రామిరెడ్డి - యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీగా ఉన్నారు. మలక్‌పేట్ ఏసీపీగా నియమితులయ్యారు.
14. జీ. శ్యామ్ సుందర్ - మలక్‌పేట్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేయాలి.
15. ఎస్. సోధనందం - ఇంటలిజెన్స్ డీఎస్పీగా ఉన్నారు. హుస్నాబాద్ ఏసీపీగా బదిలీ అయ్యారు.
16. వీ. సతీష్ - హుస్నాబాద్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
17. ఏ. యాదగిరి - సిద్ధిపేటలోని సీసీఎస్ ఏసీపీగా ఉన్నారు. హైదరాబాద్ గాంధీనగర్ ఏసీపీగా మారారు.
18. వై. మోగలయ్య - గాంధీనగర్ ఏసీపీగా ఉన్నారు. గద్వాల్ ఎస్‌డీపీఓగా బదిలీ అయ్యారు.
19. మోతే రవీందర్ రెడ్డి - ఇంటలిజెన్స్ డీఎస్పీగా ఉన్నారు. సిద్ధిపేట ఏసీపీగా మారారు.
20. జీ. మధు - సిద్ధిపేట ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి వెళ్లాలి.
21. ఎస్. వీ. రాఘవేంద్రరావు - రామగుండం ఎస్‌బీ ఏసీపీగా ఉన్నారు. హైదరాబాద్ ఎస్ఆర్ నగర్ ఏసీపీగా బదిలీ అయ్యారు.
22. హైదరాబాద్ సీసీఎస్ & డీడీ ఏసీపీ - కాచిగూడ ఏసీపీగా బదిలీ అయ్యారు.
23. పున్నం రవీందర్ రెడ్డి - ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా ఉన్నారు. నర్సంపేట (వరంగల్) ఏసీపీగా మారారు.
24. వీ. కిరణ్ కుమార్ - నర్సంపేట ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
25. ఏ. సుధాకర్ - సీఐడీ డీఎస్పీగా ఉన్నారు. హైదరాబాద్ చంద్రాయణగుట్ట ఏసీపీగా మారారు.
26. కే. మనోజ్ కుమార్ - చంద్రాయణగుట్ట ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలి.
27. బీ. సైదా - నల్గొండలోని డీసీఆర్‌బీ డీఎస్పీగా ఉన్నారు. జహీరాబాద్ ఎస్‌డీపీఓగా మారారు.
28. కే. రామ్మోహన్ రెడ్డి - జహీరాబాద్ ఎస్‌డీపీఓగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి వెళ్లాలి.
29. ఈ. రవికిరణ్ రెడ్డి - స్టాండ్‌బై డీఎస్పీగా ఉన్నారు. కూకట్‌పల్లి ఏసీపీగా బదిలీ అయ్యారు.
30. కూకట్‌పల్లి ఏసీపీ - డీజీపీ కార్యాలయంలో హాజరు కావాలి.
31. ఏ. సీ. బాలగంగిరెడ్డి - పేట్ బషీర్‌బాద్ ఏసీపీగా నియమితులయ్యారు.
32. కే. రాములు - పేట్ బషీర్‌బాద్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి వెళ్లాలి.
33. పీ. మురళీకృష్ణ - సిరిసిల్ల ఎస్‌బీ డీఎస్పీగా ఉన్నారు. పంజాగుట్ట ఏసీపీగా మారారు.
34. ఎస్. మోహన్ కుమార్ - పంజాగుట్ట ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి వెళ్లాలి.
35. వీ. ప్రసారుల కుమార్ - సైబరాబాద్ మహిళా & శిశు సురక్షణ ఏసీపీగా ఉన్నారు. సూర్యాపేట ఎస్‌డీపీఓగా మారారు.
36. జీ. రవి - సూర్యాపేట ఎస్‌డీపీఓగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
37. వీ. నర్సింహారెడ్డి - సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీగా ఉన్నారు. హెచ్ఎంఆర్ఎల్ డీఎస్పీగా మారారు.
38. కే. శ్రీనాథ్ రెడ్డి - హెచ్ఎంఆర్ఎల్ డీఎస్పీగా ఉన్నారు. సీఐడీ డీఎస్పీగా మారారు.
39. ఎస్. జానకిరెడ్డి - హెచ్ఎండీఏ డీఎస్పీగా ఉన్నారు. మహేశ్వరం ఏసీపీగా బదిలీ అయ్యారు.
40. ఎల్. కాంతారెడ్డి (లక్ష్మికాంత్ రెడ్డి) - మహేశ్వరం ఏసీపీగా ఉన్నారు. ఏసీబీకి పంపించారు.
41. వీ. మాధవి - కరీంనగర్ సీసీఆర్‌బీ ఏసీపీగా ఉన్నారు. హుజూరాబాద్ ఏసీపీగా మారారు.
42. చల్లా శ్రీనివాస్ - హుజూరాబాద్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి వెళ్లాలి.
43. ఎస్. లక్ష్మీనారాయణ - మహబూబ్‌నగర్ సీసీఎస్ డీఎస్పీగా ఉన్నారు.
44. ఎన్‌సీ. రంగస్వామి - షాద్‌నగర్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి వెళ్లాలి.
45. బీ. నారాయణ - భూపాలపల్లి డీసీఆర్‌బీ డీఎస్పీగా ఉన్నారు. మహదేవ్‌పూర్ ఎస్‌డీపీఓగా బదిలీ అయ్యారు.
46. జీ. రామ్మోహన్ రెడ్డి - మహదేవ్‌పూర్ ఎస్‌డీపీఓగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
47. పీ. ప్రశాంత్ రెడ్డి - డీజీ కంట్రోల్ రూమ్ డీఎస్పీగా ఉన్నారు. పటాన్‌చెరు ఎస్‌డీపీఓగా మారారు.
48. పైలా రవీందర్ రెడ్డి - పటాన్‌చెరు ఎస్‌డీపీఓగా ఉన్నారు. తూప్రాన్ ఎస్‌డీపీఓగా బదిలీ అయ్యారు.
49. సోమ వెంకట్ రెడ్డి - తూప్రాన్ ఎస్‌డీపీఓగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి హాజరు కావాలి.
50. జే. నరేందర్ గౌడ్ - కమాండ్ కంట్రోల్ ఏసీపీగా ఉన్నారు. సైదాబాద్ ఏసీపీగా బదిలీ అయ్యారు.
51. డీ. వెంకన్న నాయిక్ - సైదాబాద్ ఏసీపీగా ఉన్నారు. గోషామహల్ ఏసీపీగా మారారు.
52. ఎస్. సుధర్శన్ - గోషామహల్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
53. కోట్ల వెంకట్ రెడ్డి - గోషామహల్ ఏసీపీగా ఉన్నారు. కుషాయిగూడ ఏసీపీగా మారారు.
54. టీ. మహేష్ - కుషాయిగూడ ఏసీపీగా ఉన్నారు. షాద్‌నగర్ ఏసీపీగా బదిలీ అయ్యారు.
55. ఎస్. ప్రభాకర్ - పటాన్‌చెరు ఎస్‌డీపీఓగా ఉన్నారు. మార్పు వివరాలు ఫైల్‌లో స్పష్టంగా లేవు.
56. డీఎస్పీ, మహబూబ్‌నగర్ డీసీఆర్‌బీ - పేరు పేర్కొనలేదు, కానీ ఈ పోస్టు ఖాళీ అయింది.
57. కే. నర్సింహులు - విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నుంచి గజ్వేల్ ఏసీపీగా మారారు.
58. కే. పురుషోత్తం రెడ్డి - గజ్వేల్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
59. చల్లా శ్రీనివాస్ - సిరిసిల్ల డీసీఆర్‌బీ నుంచి రామగుండం ట్రాఫిక్ ఏసీపీగా బదిలీ అయ్యారు.
60. జే. నర్సింహులు - రామగుండం ట్రాఫిక్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
61. ఎన్. వెంకటేష్ - ఖమ్మం ఎస్‌బీ ఏసీపీగా ఉన్నారు. మమ్మనూర్ (వరంగల్) ఏసీపీగా మారారు.
62. బీ. తిరుపతి - మమ్మనూర్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
63. నేటి శ్రీనివాస్ - వేటింగ్‌లో ఉన్నారు. పరిజి ఎస్‌డీపీఓగా నియమితులయ్యారు.
64. ఎస్. గిరిప్రసాద్ - ఇంటలిజెన్స్ డీఎస్పీగా ఉన్నారు. బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీగా మారారు.
65. కే. శశాంక్ రెడ్డి - సైబరాబాద్ క్రైమ్ ఏసీపీగా ఉన్నారు. మార్పు వివరాలు స్పష్టంగా లేవు.
66. వీ. జైపాల్ రెడ్డి - చిల్కలగూడ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి వెళ్లాలి.
67. పీ. నరసింహారావు - రాచకొండ ఎస్‌హెచ్ఈ టీమ్స్ ఏసీపీగా ఉన్నారు. హన్మకొండ ఏసీపీగా బదిలీ అయ్యారు.
68. కే. దేవేందర్ రెడ్డి - హన్మకొండ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
69. బీ. విత్తల్ రెడ్డి - నల్గొండ డీటీసీ డీఎస్పీగా ఉన్నారు. భాన్సువాడ ఎస్‌డీపీఓగా మారారు.
70. తల్లపెల్లి సత్యనారాయణ - భాన్సువాడ ఎస్‌డీపీఓగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
71. కే. శశాంక్ రెడ్డి - గజ్వేల్ ఏసీపీగా బదిలీ అయ్యారు.
72. ఎస్. సైదయ్య - హైదరాబాద్ సీసీఎస్ & డీడీ ఏసీపీగా ఉన్నారు. మహంకాళి ఏసీపీగా మారారు.
73. సర్దార్ సింగ్ - మహంకాళి ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
74. పీ. ప్రవీణ్ కుమార్ - వివరాలు ఇవ్వలేదు (ఫైల్‌లో కట్ అయ్యింది).
75. ఏ. చంద్రశేఖర్ - అబిడ్స్ ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
76. మొద్. వహీదుద్దిన్ - రోడ్ సేఫ్టీ డీఎస్పీగా ఉన్నారు. ట్రాఫిక్ సౌత్ జోన్ ఏసీపీగా మారారు.
77. కే లక్ష్మణ్ - ట్రాఫిక్ (సౌత్) ఏసీపీగా ఉన్నారు. డీజీపీ కార్యాలయానికి పంపించారు.
78. పీ. సదయ్య - సీఐడీ డీఎస్పీగా ఉన్నారు. వరంగల్ క్రైమ్ ఏసీపీగా మారారు

# మనం ఎన్ని విమానాలు కోల్పోయాం?

## పాక్‌కు ఆపరేషన్ సిందూర్ సమాచారం ఎందుకిచ్చాం


### ఇది తప్పిదం కాదు.. నేరం దేశానికి నిజం తెలియాలి

### ఎక్స్ ఎంపీ రాహుల్ గాంధీ సంచలన ట్వీట్

**ఢిల్లీ:** ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆపరేషన్ సిందూర్ వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ పాకిస్థాన్‌కు ముందస్తు సమాచారం ఇచ్చారన్న ఆరోపణలపై ఆయనను నిలదీశారు. ఈ వ్యవహారంలో భారత వైమానిక దళం ఎన్ని విమానాలను కోల్పోయిందో చెప్పాలని రాహుల్ గట్టిగా ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్ దాడి ప్రారంభానికి ముందే పాకిస్థాన్‌కు సమాచారం చేరవేయడం నేరమని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ విషయంలో జైశంకర్ మౌనం వహించడం కేవలం సమాచారాన్ని వెల్లడించకపోవడం మాత్రమే కాదని, అది విపత్కర పరిణామం అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. 'మరోసారి అడుగుతున్నాను, పాకిస్థాన్‌కు ముందే సమాచారం తెలియడం వల్ల మనం ఎన్ని విమానాలు కోల్పోయాం?' అని జైశంకర్‌ను సూటిగా ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం చేసిన పోస్టుకు కొనసాగింపుగా ఈ తాజా ట్వీట్ చేశారు.

**సమాచారం ఇవ్వడం నేరం..**

జైశంకర్ మీడియాతో మాట్లాడినప్పటి వీడియోను రాహుల్ గాంధీ గత రెండ్రోజుల క్రితం షేర్ చేశారు. 'ఆపరేషన్ ప్రారంభంలో పాకిస్థాన్‌కు మెసేజ్ పంపాం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మీద దాడి చేస్తామే కానీ మిలిటరీ మీద కాదని చెప్పాం. అందువల్ల మిలిటరీ ఈ విషయంలో జోక్యానికి దూరంగా ఉండే అవకాశం ఉంటుంది. అయితే మంచి మాటలు చెవికెక్కని విధానాన్నే వాళ్లు ఎంచుకున్నారు' అని చెబుతున్నట్టుగా ఉన్న వీడియోను రాహుల్ షేర్ చేశారు. దాడికి ముందే పాకిస్థాన్‌కు సమాచారం ఇవ్వడం నేరమని, భారత ప్రభుత్వం ఈ పని చేసిన విషయాన్ని విదేశాంగ మంత్రి బహిరంగంగానే అంగీకరించారని రాహుల్ పేర్కొన్నారు. ఫలితంగా ఎన్ని విమానాలను భారత్ కోల్పోయిందో చెప్పాలని ప్రశ్నించారు.



# జూన్ 30లోగా నివేదిక ఇవ్వండి

## గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం హెచ్‌ఆర్‌సీ సీరియస్

### ఘటనపై సుమోటోగా కేసు విచారణకు కమిషన్ చైర్మన్ ఆదేశం

### సీఎస్‌తో పాటు పలువురికి నోటీసులు జారీ

(మొదటిపేజీ తరువాయి)

హెచ్‌ఆర్‌సీ స్పందించింది. ఘటనలో 17 మంది దుర్మరణం కారణాలపై జూన్ 30లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ మేరకు, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, అగ్నిమాపక శాఖ డీజీ, టీఎస్ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్లకు కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. ప్రమాదంపై చార్మినార్ పోలీసులు కేసులు.. మరోవైపు ఈ అగ్ని ప్రమాదంపై చార్మినార్‌పోలీసులు కేసులు నమోదు చేశారు. మృతులబంధువు ఉత్కర్ష్ మోడీ ఇచ్చిన ఫిర్యాదు మేరకుఫైర్ యాక్సిడెంట్‌గా పేర్కొంటూ ఎఫ్‌ఐఆర్ జారీచేశారు. దీనిపై ఉత్కర్ష్ మోడీ పోలీసులకు ఫిర్యాదు ఇస్తూ ఆదివారం ఉదయం 6.10గంటలకు రాహుల్ తన తండ్రి వినోద్ మోడీకి ఫోన్ చేసినట్లు పేర్కొన్నాడు. వెంటనే గుల్జార్ హౌస్‌కు రావాలని చెప్పాడని తెలిపాడు. దాంతో తామిద్దరం హుటాహుటిన గుల్జార్ హౌస్‌కు వచ్చినట్టు పేర్కొన్నాడు. తాము వచ్చేసరికే భవనం గ్రౌండ్, ఫస్ట్ ఫ్లోర్ లలో మంటలు వ్యాపించాయని తెలిపాడు. కొందరు స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది, డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నాడు. ప్రమాదంలో గాయపడ్డ వారిని మలక్ పేట యశోద, డీఆర్డీవో అపోలో, నాంపల్లి కేర్ తదితర ఆస్పత్రులకు తరలించారని తెలిపాడు. ప్రమాదం జరిగినప్పుడు ఇంట్లో మొత్తం 21 మంది ఉన్నట్టుగా తెలియచేశాడు. ప్రమాదంపై తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయని పేర్కొన్న ఉత్కర్ష్ మోడీ సమగ్ర విచారణ జరిపి చట్టపర చర్యలు తీసుకోవాలని కోరాడు. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

# ఇద్దరు కాదు.. ఆరుగురు

## ఇన్ స్టా గ్రూప్ క్రియేట్.. అందులోనే బ్లాస్టింగ్ పాఠాలు

### విజయనగరం వేదికగా పేలుళ్ళ రిహార్సల్ ప్లాన్

### హైదరాబాద్ లో బాంబుపేలుళ్ళకు స్కెచ్

(మొదటిపేజీ తరువాయి)

అదేవిధంగా నిందితులకు నిధులు ఎవరు, ఎక్కడి నుంచి సమకూర్చారన్న కోణంలో వారిని విచారించాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే వారి వాదనలతో పూర్తిగా ఏకీభవించిన కోర్టు నిందితులు సిరాజ్, సయ్యద్ సమీర్‌లకు 14రోజుల రిమాండ్ విధిస్తున్నట్లుగా న్యాయమూర్తి వెల్లడించారు. అనంతరం పోలీసులు ఆ ఇద్దరిని విచారణ నిమిత్తం విశాఖ సెంట్రల్ జైలుకు తరలిస్తున్నారు. అయితే ఈ ఘటనలో ఇద్దరు కాదు.. మొత్తం ఆరుగురు ఉన్నట్లు తెలుస్తోంది. రంపచోడవరం అడవుల్లో ఒకసారి ప్రాక్టీస్ చేయగా, హైదరాబాద్‌లో పేలుళ్ళకు పలు ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నిందితులు ఆ సంస్థకు చెందిన వారే..**

ప్రధానంగా టార్గెట్‌గా చేసుకుని వరుస బ్లాస్ట్‌లకు ప్లాన్ చేస్తున్న టెర్రరిస్టుల కుట్రలను దర్యాప్తు సంస్థలు భగ్నం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు విజయనగరంలో కేసు నమోదు కాగా.. అదే ప్రాంతానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్ (29)తో పాటు సికింద్రాబాద్ బోయిగూడకు చెందిన సయ్యద్ సమీర్ (28)ను పోలీసులు అరెస్ట్ చేశారు. సిరాజ్ ఇంజినీరింగ్ పూర్తి చేసి జాబ్స్ కోసం చూస్తుండగా.. సమీర్ లిఫ్ట్ ఆపరేటింగ్ సంస్థలో విధులు నిర్వర్తిస్తున్నాడు. తాజాగా లభించిన ఆధారాల మేరకు ఆ ఇద్దరూ అల్ హింద్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ సంస్థకు చెందిన వారిగా గుర్తించారు. పేలుళ్ల కుట్రలో సిరాజ్ ఉర్ రెహ్మాన్ ప్రధాన సభ్యుడిగా ఉండగా.. సమీర్ సయ్యద్ సహాయకుడి ఉన్నట్లుగా తెలిసింది.

**ఇన్‌స్టాగ్రామ్‌లో బ్లాస్టింగ్ పాఠాలు..**

ఇక సౌదీ అరేబియా నుంచి గుర్తు తెలియని ఉగ్రవాద సంస్థకు చెందిన హ్యాండ్లర్ టెర్రర్ ఎటాక్, బాంబ్ బ్లాస్ట్ ఎలా చేయాలో వారికి గైడ్ చేసినట్లుగా నిఘా సంస్థలు గుర్తించాయి. మొత్తం సంప్రదింపులు ఎవరికి అనుమానం రాకుండా ఇన్‌స్టాగ్రామ్ అకౌంటర్ నుంచి జరిపినట్లుగా తెలుస్తోంది. భారీ బ్లాస్ట్‌కు ప్లాన్ చేస్తూ.. పొటాషియం క్లోరేట్, సల్ఫర్ ఇతర మందుగుండు సామగ్రిని కొనుగోలు చేశారని నిర్ధారణ అయింది. ఈ నెల 21 లేదా 22 తేదీల్లో విజయనగరం ఏరియాలో బ్లాస్ట్ రిహార్సల్స్ చేపట్టాలని ప్లాన్ చేస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోలీసులు వారి కుట్రను చాకచక్యంగా భగ్నం చేశారు.

**రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు..**

హైదరాబాద్ పేలుళ్ల కుట్ర కేసుకు సంబంధించి రిమాండ్ సిరాజ్ ఉర్ రెహ్మాన్, సమీర్ సయ్యద్ రిమాండ్ రిపోర్టులో మరికొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు టెలిగ్రామ్‌లో ఆరుగురు కలిసి గ్రూప్ క్రియేట్ చేసినట్లుగా తేలింది. నిందితులు సిరాజ్, సమీర్‌తో పాటు కర్నాటక, మహారాష్ట్రకు చెందిన యువకులు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. అదేవిధంగా హైదరాబాద్ నగరంలో ఐసిస్ ఆదేశాలను అమలు చేయడంపై మూడు రోజుల పాటు కలిసి మీటింగ్ నిర్వహించినట్లుగా వెల్లడైంది. టిఫిన్ బాక్స్ బాంబులు తాయారు చేయాలని పైనుంచి ఆదేశాలు అందగా.. అమెజాన్‌లో టిఫన్ బాక్సులు, వైర్లు, రిమోట్ సెల్స్‌ను సిరాజ్ ఆర్డర్ చేసినట్లుగా రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

**సౌదీ అరేబియా నుంచి సమాచారం**

ఈ మేరకు ఇంజినీరింగ్ పూర్తిచేసిన సిరాజ్ ఉద్యోగం వేటలో ఉండగా.. సమీర్ లిఫ్ట్ ఆపరేటర్ గా పనిచేస్తున్నట్లు తెలిపారు. అయితే వీరిద్దరు కొంతకాలంగా అల్ హింద్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (అహిం) పేరిట సంస్థను ఏర్పాటు చేసి కార్యకలాపాలు సాగిస్తున్నట్లు నిర్ధారించారు. సిరాజ్ నంబర్ 1, సమీర్ 2గా ఉన్నట్లు వెల్లడించారు. అంతేకాదు వీరికి సౌదీ అరేబియా నుంచి గుర్తుతెలియని ఉగ్రవాద సంస్థ హ్యాండ్లర్ మార్గనిర్దేశం చేసినట్లు దర్యాప్తులో తేలినట్లు అధికారులు చెప్పారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వీరితో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం సేకరించారు. పక్కా ప్రణాళిక ప్రకారం పేలుళ్లకు కుట్ర చేస్తున్నారని, ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా పేలుడు పదార్థాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే మే 21 లేదా 22న విజయనగరం పరిసరాల్లో బాంబుపేలుళ్లకు రిహార్సల్స్ చేయాలని ఫిక్స్ కాగా ఇంతలోనే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా కుట్రను భగ్నం చేసినట్లు వెల్లడించారు.

# రూ.35 కోట్లు సరిపోతాయా?

(మొదటిపేజీ తరువాయి)

పుష్కరాల నిర్వహణలో రేవంత్ ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శలు చేశారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఉండి ఉంటే దక్షిణాది మొత్తానికి సరస్వతి పుష్కరాలను పండుగగా నిర్వహించే వాళ్లమని చెప్పుకొచ్చారు. అందాల పోటీలను నిర్వహించడానికి అభ్యంతరం లేదని... కానీ ఆధ్యాత్మిక పుష్కరాలను పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. సరస్వతి పుష్కరాలు నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ధ్వజమెత్తారు. ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్న పుష్కర పండగకు ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ. 35 కోట్లు ఎలా సరిపోతాయని నిలదీశారు. అందాల పోటీలకు రూ.300 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం ఆధ్యాత్మికతకు రూ. 35 కోట్లు వెచ్చించడమెంటని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

**గతంలో వేములవాడకూ ఇలానే..**

కేంద్రమంత్రి బండి సంజయ్ తన సతీమణి అపర్ణతో కలిసి సోమవారం మధ్యాహ్నం కాళేశ్వరం విచ్చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఉన్నతాధికారులు కేంద్రమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పోలీస్ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య కేంద్రమంత్రి దంపతులు పుష్కర స్నానాన్ని ఆచరించారు. అక్కడి నుంచి నేరుగా శ్రీకాళేశ్వర ముక్తేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. బండి సంజయ్ దంపతులకు పూజారులు ప్రత్యేక ఆశీర్వచనం అందించారు. అంతకుముందు పుష్కరఘాట్ వద్ద, ఆ తర్వాత కాళేశ్వర స్వామి ఆలయం వద్ద మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. 12 సంవత్సరాలకు ఒకసారి వచ్చే సరస్వతి పుష్కర స్నానం చేయడం చాలా సంతోషంగా ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. 'సరస్వతి పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం విచ్చేసి పుష్కర స్నానం ఆచరించడం చాలా సంతోషంగా ఉంది. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల త్రివేణి సంగమం ఇది. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలకు హాజరై స్నానమాచరించడం ఆనందంగా ఉంది. దేశ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని, వారి కష్టాలన్నీ తొలగిపోవాలని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశానికి మరింతగా సేవలు అందించేలా దీవించాలని ఆ స్వామివారిని ప్రార్థించా. ఏమైనా మాట్లాడితే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నిస్తారు. అన్నీ కేంద్రమే చేస్తే ఇక రాష్ట్రం ప్రభుత్వం ఎందుకు. కేవలం ఒక ఏరియాకే పుష్కరాలను పరిమితం చేయడం సరికాదు. పుష్కర స్నానానికి వచ్చే భక్తులందరి కోరికలు తీర్చాలని, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నా. కాళేశ్వరం చాలా శక్తివంతమైన ప్రాంతం. గత కేసీఆర్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో మనకు చాలా చెడ్డ పేరు వచ్చింది. అలాగే గత ప్రభుత్వం కాళేశ్వరం ఆలయానికి రూ.100 కోట్లు ఇస్తానని మొండిచేయి చూపింది. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కూడా రూ. 200 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చారు. గతంలో వేములవాడకూ ఇలానే హామీ ఇచ్చారు. కానీ ఎన్ని నిధులిచ్చారో ప్రజలందరికీ తెలుసు. ఇప్పటికైనా వట్టి హామీలను పక్కనపెట్టి కాళేశ్వరాన్ని అద్భుతమైన ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి' అని కేంద్రమంత్రి బండి సంజయ్ కోరారు.



# మళ్లీ పొడిగింపు..

## కాళేశ్వరం కమిషన్ విచారణ గడువు పెంపు

మరో 2 నెలలు పొడిగించిన ప్రభుత్వం.. నేతల విచారణ కోసమే తాజాగా పొడిగింపు

కేసీఆర్, హరీశ్, ఈటలను విచారణకు పిలిచే అలోచనలో కమిషన్!



**హైదరాబాద్, మహా:** కాళేశ్వరం కమిషన్ విచారణ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. మరో రెండు నెలలపాటు గడువు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఇటీవలే కాళేశ్వరం కమిషన్ విచారణ పూర్తయ్యింది. త్వరలోనే కమిషన్ నివేదిక బయటపెట్టబోతున్నారన్న వార్తలు కూడా వచ్చాయి. మరోవైపు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కమిషన్ కేసీఆర్, హరీశ్ రావు, ఈటల రాజేందర్‌ను ఎందుకు విచారించలేదన్న ప్రశ్నలు కూడా ఉత్పన్నం అయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేసీఆర్‌ను నిందిస్తూ పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ప్రభుత్వం కాళేశ్వరం కమిషన్ గడువు పెంచిన నేపథ్యంలో కేసీఆర్ సహా నాటి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన పలువురు కీలక నేతలను విచారణకు పిలుస్తారా? అన్న చర్చ జరుగుతున్నది. కాళేశ్వరం కమిషన్ గడువును జులై నెలాఖరు వరకు పెంచుతున్నట్లు పేర్కొంది.

**వారే కీలకమా?**

కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నిర్వహిస్తున్న విచారణ కీలక దశకు చేరుకుంది. ప్రాజెక్టు విషయంలో తీసుకున్న నిర్ణయాల్లో కీలకపాత్ర పోషించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌లకు కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించి ప్రశ్నించాల్సి ఉంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై గతేడాది నుంచి విచారణ జరిపింది. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై విచారించింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను ప్రశ్నించింది. ఈ దఫాలోనే వారికి సమన్లు పంపించి క్రాస్ ఎగ్జామినేషన్‌కు హాజరు కావాలని కమిషన్ కోరే అవకాశం ఉందని టాక్ నడుస్తోంది. ఇప్పటికే పలు దఫాలుగా నిర్వహించిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో బరాజ్‌ల నిర్మాణంలో భాగస్వాములైన నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజనీర్లు, ఇతర ఇంజనీర్లతోపాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులను కమిషన్ ప్రశ్నించి కీలక సాక్ష్యాధారాలు సేకరించిన విషయం తెలిసిందే. వీటిని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్, ఈటల ముందు ఉంచి ప్రశ్నించనున్నట్టు సమాచారం.



## ప్రెస్ క్లబ్ లో ఐఎన్టీయుసీ నాయకుల ఫైటింగ్

### ఒకరిపై మరొకరు పిడిగుద్దులు

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లో ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకులు బాహాబాహీకి దిగారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సంఘాల నాయకుల మధ్య గొడవ జరిగింది. ఐఎన్టీయూసీ(ఆర్) అంబటి కృష్ణమూర్తి వర్గీయులపై ఐఎన్టీయూసీ సంజీవరెడ్డి వర్గీయులు దాడికి దిగారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఐఎన్టీయూసీ(ఆర్) నేషనల్ ప్రెసిడెంట్ అంబటి కృష్ణమూర్తి ప్రెస్‌మీట్‌ను అడ్డుకున్న ఐఎన్టీయూసీ నేత సంజీవరెడ్డి అనుచరుడు చంద్రశేఖర్, ఇతర వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో అంబటి వర్గీయులు సైతం సంజీవరెడ్డి వర్గీయులపై ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో ఒకరిపై మరొకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. అయితే రంగంలోకి దిగిన అబిడ్స్ పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పారు. సంజీవరెడ్డి అనుచరుడు చంద్రశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అంబటి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. సంజీవరెడ్డి తనపై నిరాధార ఆరోపణలు చేశారని ఆరోపించారు. ఆ ఆరోపణలను ఖండించేందుకు ప్రెస్‌మీట్ పెడితే దాడి చేశారని అన్నారు.

# భారత్ ఏమైనా ధర్మసత్రమా?


## శరణార్థులకు ఆశ్రయం ఇవ్వలేం: సుప్రీం

శ్రీలంక శరణార్థి అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు

భారత్ ప్రపంచ శరణార్థులకు ధర్మశాల కాదని స్పష్టం

140 కోట్ల జనాభాతో మేమే సతమతమవుతున్నామన్న జస్టిస్ దత్తా

ఆర్టికల్ 19 హక్కులు కేవలం భారత పౌరులకేనని ఉద్ఘాటన



**ఢిల్లీ:** ప్రపంచంలోని అందరికీ ఉచితంగా ఆశ్రయం ఇవ్వడానికి ఈ దేశం ధర్మశాల కాదని సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. శరణార్థిగా తనకు ఇండియాలో ఆశ్రయం ఇవ్వాలని శ్రీలంక జాతీయుడు ఒకరు చేసిన అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ)తో సంబంధాలున్నాయనే అనుమానంతో 2015లో పిటిషనర్‌ను అరెస్టు చేశారు. తనను శరణార్థిగా పరిగణించాలని కోరుతూ అతను వేసిన తాజా పిటిషన్‌పై న్యాయమూర్తులు దీపాంకర్ దత్తా, జస్టిస్ కె.వినోద్ చంద్రతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. శ్రీలంక జాతీయుడికి 2018లో విచారణ కోర్టు చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద పదేళ్ల జైలు శిక్ష విధించింది. 2022లో మద్రాసు హైకోర్టు అతని జైలుశిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్ష పూర్తికాగానే దేశం విడిచి వెళ్లాలని, దేశం విడిచివెళ్లడానికి ముందు శరణార్థి శిబిరంలో ఉండాలని ఆదేశించింది. కాగా, సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా పిటిషనర్ తన వాదన వినిపించారు. వీసాతో తాను ఇండియా వచ్చానని, తన ప్రాణాలకు స్వదేశంలో ముప్పు ఉందని కోర్టుకు విన్నవించారు. తన భార్య, పిల్లలు ఇండియాలో స్థిరపడ్డారని, ఇప్పటికి తాను మూడేళ్లుగా నిర్బంధంలో ఉన్నానని, డిపోర్టేషన్ ప్రక్రియ మొదలుకాలేదని చెప్పారు.

**మీకున్న హక్కు ఏంటి?..**

దీనిపై జస్టిస్ దత్తా స్పందిస్తూ.. ''ప్రపంచంలోని శరణార్థులందరికీ ఇండియా ఆతిథ్యం ఇవ్వాలా? ఇప్పటికే 140 కోట్ల జనాభాతో ఉన్నాం. విదేశీయులందరికీ ఇక్కడ ఆశ్రయం ఇవ్వడానికి ఇదేమీ ధర్మశాల కాదు'' అని అన్నారు. ఇందుకు ప్రతిగా పిటిషనర్ తరఫు న్యాయవాది తన వాదన వినిపిస్తూ, ఈ అంశం రాజ్యాంగంలోని 21, ఆర్టికల్ 19 కిందకు వస్తుందన్నారు. దీనిపై జస్టిస్ దత్తా మాట్లాడుతూ, పిటిషనర్‌ను చట్టప్రకారమే కస్టడీలోకి తీసుకున్నందున అతని నిర్బంధం ఆర్టికల్ 21ని ఉల్లంఘించినట్టు కాదన్నారు. ఆర్టికల్ 19 అనేది భారత పౌరులకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేశారు. ''ఇక్కడ సెటిల్ కావడానికి మీకున్న హక్కు ఏంటి?'' అని కోర్టు ప్రశ్నించింది. అతను శరణార్థని, అతని ప్రాణాలకు శ్రీలంకలో ప్రమాదం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించగా, మరో దేశానికి వెళ్లండి అంటూ ధర్మాసనం స్పష్టం చేస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది.



## కిషన్ రెడ్డి.. గల్లీ లీడర్‌లా మాట్లాడొద్దు

- విమర్శలు మాని ప్రజలకు సర్వీస్ చేయ్
- చర్లపల్లి రైల్వే స్టేషన్ ఈదురు గాలికే రేకులు పడిపోలేదా..?
- హైదరాబాద్ ఘటనపై మీ వ్యవహార శైలీ సరికాదు
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్

**హైదరాబాద్, మహా:** బీజేపీ ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం సరికాదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. గుల్జార్ హౌస్‌లో 17 మంది మృతి చెందటం బాధాకరమని పేర్కొన్నారు. సోమవారం ఆయన గాంధీభవన్ లో మాట్లాడుతూ.. భారత మాతకు హారతి ఇచ్చే సమయంలో టపాకాయలు పడి ముగ్గురు మృతి చెందిన ఘటనలు ఇంకా గుర్తున్నాయన్నారు. గుజరాత్ లో బ్రిడ్జి కూలిపోయి 140 మంది చనిపోతే తమ నాయకుడు రాహుల్ గాంధీ రాజకీయం చేయలేదని వివరించారు. కానీ ఇప్పుడు హైదరాబాద్ ఘటనపై కిషన్ రెడ్డి వ్యవహార శైలీ సరికాదన్నారు. ఘటన జరిగిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి అధికారులను అలర్ట్ చేశారన్నారు. సీఎం అక్కడికి వెళ్తే డిస్ట్రబ్ అవుతారని ప్రస్తుతానికి వెళ్లలేదన్నారు. మంత్రులంతా అక్కడే వర్క్ చేశారన్నారు. ఆ ప్రమాదంలో తన సన్నిహితుడు కుటుంబం కూడా ఉన్నట్లు జగ్గారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి హోదా మరిచి కిషన్ రెడ్డి గల్లీ లీడర్ లా మాట్లాడటం సరికాదన్నారు. సమస్యలు ఉంటే సీఎంకు వివరించాలన్నారు. కానీ ఘటనపై ప్రభుత్వ రెస్పాన్స్ తీరును తప్పుపట్టడంలో అర్థం లేదన్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ లో వర్షం వస్తే రేకులు కూలిపోయాయన్నారు. కిషన్ రెడ్డి విమర్శలు మాని, ప్రజలకు సర్వీస్ చేయడం నేర్చుకోవాలన్నారు.

# డిక్లరేషన్ల పేరిట డంబాచారం

(మొదటిపేజీ తరువాయి)



అమలు చేస్తామన్న రైతు డిక్లరేషన్ ఆగమైపోయింది.. బీరాలు పలికిన బీసీ డిక్లరేషన్ దిక్కు లేకుండా పోయిందని.. ఇప్పుడు కొత్తగా నల్లమల డిక్లరేషన్ తెర మీదకు తీసుకొచ్చారని మండిపడ్డారు. పైన పటారం లోన లొటారం డిక్లరేషన్ల పేరిట డంబాచారమని సెటైర్ వేశారు. ఎక్కడిక్కడ ముందస్తు అరెస్టులు చేసి, చెంచు ఉద్యమ నాయకులను నిర్బంధించి నల్లమల డిక్లరేషన్ ప్రకటించడమే ప్రజా పాలనా అని ప్రశ్నించారు. ఎప్పటిలాగే రేవంత్ ప్రసంగంలో తెచ్చి పెట్టుకున్న ఆవేశం తప్ప, కంటెంట్ లేదు, కాంటెస్ట్ లేదని అన్నారు. ఆత్మస్తుతి పరనింద తప్ప, అక్కరకు వచ్చే ముచ్చట లేదని విమర్శించారు. అలవాటైన ఊకదంపుడు ప్రసంగాన్నే అదే పనిగా దంచాడని అన్నారు.

**ఇంతకన్నా మోసం, దగా**

మహాలక్ష్మి కింద నెల నెలా రావాల్సిన 2500 ఇంకా రావడం లేదని ఆడబిడ్డలు.. కల్యాణ లక్ష్మి కింద రావాల్సిన తులం బంగారం కోసం ఆడపిల్ల తల్లిదండ్రులు.. మీరిస్తామన్న స్కూటీల కోసం ఆశగా ఎదురు చూస్తున్న యువతులు.. పదే పదే గుర్తు చేసుకుంటున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. విద్యాభరోసా కింద ఇస్తామన్న 5 లక్షల కార్డు కోసం విద్యార్థులు.. ఏడాదిలో ఇస్తామని చెప్పి ఏడాదిన్నర దాటుతున్నారని 2లక్షల ఉద్యోగాల కోసం, ఏ నెలకు ఆ నెలకు ఖాళీలను భర్తీ చేస్తూ ప్రకటిస్తామన్న జాబ్ క్యాలెండర్ కోసం నిరుద్యోగులు గుర్తు చేసుకుంటున్నారని చెప్పారు. ఇంకా పింఛన్లు పెంచుతలేవని అవ్వాతాతలు, దివ్యాంగులు, నిస్సహాయులు.. డీఏ, పీఆర్సీ, పింఛన్ ప్రయోజనాల కోసం ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు.. తమను ఎప్పుడు ప్రభుత్వంలో విలీనం చేస్తారా అని ఆర్టీసీ కార్మికులు నిత్యం నిన్నే తలుచుకుంటున్నరని తెలిపారు. రేవంత్ రెడ్డి అతిశయోక్తులు ఎట్లా ఉంటాయంటే, అమాస నాడు పున్నమి వెన్నల అనగలడని హరీశ్‌రావు సెటైర్ వేశారు. ఓవైపు నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగులు కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తుంటే, నిరుద్యోగులే నోటిఫికేషన్లు వద్దంటున్నారని తుపాకీ రాముని డైలాగులు పేలుస్తూ కామెడీ చేస్తున్నడని అన్నారు. రేవంత్ రెడ్డి రంగులు మార్చే తీరును చూసి నల్లమల అడవుల్లోని ఊసరవెల్లులు కూడా నివ్వెరపోతున్నాయని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు.

# ఎల్‌వోపీ కోసం హరీశ్ రావు ఫైట్

## బీఆర్ఎస్ అంటే బాపు, బేటా, భేటీ, బతీజా రాష్ట్ర సమితి

కేటీఆర్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించే అవకాశం.. అందుకే ప్రతిపక్ష హోదా కోసం హరీశ్ కుస్తీ

మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి



**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ అంటే బాపు, బేటా, భేటీ, బతీజా రాష్ట్ర సమితిగా మారిందని మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష హోదా కోసం మాజీ మంత్రి హరీష్‌రావు కుస్తీ పడుతున్నారని ఆరోపించారు. కేటీఆర్‌కు పార్టీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉన్నదని ముందే ఊహించిన హరీశ్ రావు, ప్రతిపక్ష నాయకుడి హోదా కోసం పట్టుబడుతున్నారని వివరించారు. ఆ పార్టీలో ఉనికి కోసం హరీశ్ రావు పాకులాడుతున్నారని వివరించారు. ఆ పోస్టు ఇవ్వకపోతే పార్టీ నుంచి బయటకు వెళ్లినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో నాలుగు ముక్కలాట కొనసాగుతుందని, రజతోత్సవ సభ సాక్షిగా హరీశ్ రావును పక్కకు పెట్టినట్లు స్పష్టంగా అర్థమవుతుందన్నారు. అందుకే ఎల్వోపీ కోసం హరీశ్ రావు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆలే నరేంద్ర నుంచి ఈటల రాజేందర్ వరకు పార్టీ నుంచి ఎలా పంపారో..అదే విధానంలో హరీశ్ రావు కూడా బయటకు పంపిస్తారని సామా వివరించారు. హరీశ్ ఎల్‌వోపీ ఇస్తే, తన రాజకీయ జీవితం ముగిసినట్లేనని కేటీఆర్ భయపడుతున్నారని కామెంట్స్ చేశారు.

# సిబిఐకే చుక్కలు..

## సీబీఐ చేతుల్లో ఐఆర్ఎస్ మాఫియా గుట్టురట్టు

బయటపడిన జీవన్ లాల్ బినామీల బంధం

అడుగు అడుగునా అవినీతి ... సీబీఐకి సవాలు

**ఖమ్మం, మహా:** భారతదేశంలో సాధారణంగా లంచాల కేసుల్ని దర్యాప్తు చేసే అధికారులే ఒక అధికారిని తలలు పట్టుకొని చూస్తే అది పెద్ద కథే. కానీ ఇప్పుడు అది నిజంగా జరిగింది. ఈ కథా నాయకుడు ఐఆర్ఎస్ అధికారి జీవన్ లాల్. పల్లెలో జన్మించి పట్టణ పాలసీలో పుట్టినట్లు వ్యవహరించిన ఇతడి దందాలు చూసిన సీబీఐకి అక్షరాలా షాక్ తగిలింది. కోట్ల రూపాయల సంపాదన, బినామీ వ్యవస్థ, క్వాలిటీ భవనాల్లో పెట్టుబడులు, కుటుంబం మీద ఆస్తుల నమోదు – ఇదంతా ఒక కమర్షియల్ సినిమా స్క్రిప్ట్ లా ఉంది. కానీ ఇది రియల్! సీబీఐ దర్యాప్తుతో బయటపడిన ఈ కథ ఆర్గనైజ్డ్ క్రైమ్ లా ఉంది. నిజంగా జీవన్ లాల్ వ్యవహారాలు చూసి సీబీఐకి పచ్చి చెమటలు పట్టిన సంగతి వాస్తవం. పన్ను చెల్లింపుదారుల నిధులతో జీవించాల్సిన ప్రభుత్వాధికారి... నిధులనే తన వ్యక్తిగత స్వార్థాలకు వాడుకుంటే ఏమవుతుంది? న్యాయాన్ని పరిరక్షించాల్సిన పరిపాలనా వ్యవస్థ అధికారి చేతుల్లోనే న్యాయహింస జరగడం చూస్తుంటే ప్రజాస్వామ్య వ్యవస్థ తలదించుకునేలా తయారవుతుంది. కేంద్ర ఆదాయపు పన్ను శాఖలో ఐఆర్ఎస్ అధికారి పదవిలో ఉన్న జీవన్ లాల్ ఆచరణలు ఇప్పుడు సీబీఐని కూడా నిర్ఘాంతపరిచే స్థాయికి తీసుకెళ్లాయి. కేవలం 70 లక్షల లంచం కేసుతో ప్రారంభమైన దర్యాప్తు ఇప్పుడు బినామీ ఆస్తుల సామ్రాజ్యంగా, అశేషంగా వ్యాపించిన అవినీతిరంగ మాఫియాగా మారిపోతోంది. ఇది లంచం కేసు కాదు – ఇది ఒక ప్రభుత్వ వ్యవస్థలోనే పతనం పట్ల ప్రజలకు హెచ్చరికగా నిలిచే సంఘటనగా మారింది. ఇప్పుడు వెలుగులోకి వస్తున్న వివరాల ప్రకారం, జీవన్ లాల్ అనేక కంపెనీలతో దందాలు, అనేక రాజకీయ నాయకులతో సంబంధాలు, బినామీ ఆస్తుల చుట్టూ అల్లుకున్న అగాధం – ఇవన్నీ కలిపి ఒక రక్తదాహి పాలనను తలపిస్తున్నాయి.

**బినామీ ధనాల మాయాజాలం**

జీవన్ లాల్ అనేక విలువైన ఆస్తులను తన భార్య, తల్లి, బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించాడు. కానీ ఆ ఆస్తుల అసలైన డాక్యుమెంట్లు మాత్రం తన ఇంటిలో భద్రంగా ఉంచుకున్నాడని సీబీఐ గుర్తించింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ఢిల్లీ వంటి ప్రధాన నగరాల్లో అపార్ట్‌మెంట్లు, ఖరీదైన స్థలాలు, ఖరీదైన వాహనాల వివరాలు ఇప్పుడు విచారణలో వెల్లడి అవుతున్నాయి. ఒక్కో ఆస్తి వెనక ఒక్కో లంచం కథ ఉంది. సీబీఐ ముందున్న గుట్టు .. అంతర్లీన వ్యవస్థల ఆత్మ పరీక్ష. ఇప్పటి వరకు సీబీఐ తన దర్యాప్తు చరిత్రలో ఎన్నో రాజకీయ, కార్పొరేట్ స్కాంలను పరిష్కరించింది. కానీ జీవన్ లాల్ కేసులో మాత్రం విచారణ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. కారణం – ఇది కేవలం ఒక లంచం కేసు కాదు, ఇది కేంద్ర ప్రభుత్వ శాఖల్లో లంచాలుగా మారిన వ్యవస్థపై కుటిల ఆరోపణ. సీబీఐ అధికారులు ఇదే మాట చెప్పారు – "ఇది ట్రైలర్ మాత్రమే. అసలు సినిమా ఇప్పుడు మొదలవుతోంది.

**రాములు నాయక్ కుమారుడిగా – రాజకీయ నేపథ్యం.**

వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ కుమారుడిగా జీవన్ లాల్ రాజకీయ నేపథ్యాన్ని కలిగి ఉన్నవాడు. తెలంగాణలో అతని సంబంధాలు, ఆదాయపు పన్ను శాఖలో పదవి పొందడం వెనుక ఉన్న రాజకీయ ప్రేరణలూ ఇప్పుడు విచారణలో భాగంగా మారాయి. ఎవరి ఆశీస్సులతో ఈ అధికారి ఆ స్థాయికి చేరుకున్నాడన్నదే అసలైన ప్రశ్నగా మారింది.

**షాపూర్జీ పల్లోంజీ ఫైళ్ల వ్యవహారం:**

సీబీఐ మొదట జీవన్ లాల్‌పై దృష్టి పెట్టినది షాపూర్జీ పల్లోంజీ సంస్థకు చెందిన కొన్ని ప్రాజెక్టులపై విధించాల్సిన పన్నులు, ఆ సంస్థ ఫైళ్లను ప్రాసెస్ చేయడానికి లంచాలు వసూలు చేశాడన్న ఆరోపణలతో. కాంట్రాక్టర్లు, టాప్ మేనేజ్‌మెంట్ సీఈఓలతో జీవన్ లాల్ నేరుగా సంప్రదింపులు జరిపిన ఆడియో–వీడియో ఆధారాలు కూడా లభ్యమయ్యాయి.



**ఇతను ఒంటరిగా చేయగలడా? లేక వ్యవస్థే కుప్పకూలిందా?**

జీవన్ లాల్ ఒంటరిగా ఈ స్థాయికి దొంగతనాలు చేయగలడా? లేక ఇతర ఐఆర్ఎస్ అధికారులు, శాఖా నాయకులు, అధికారులు కలిసి వ్యవస్థను పూర్తిగా అవినీతిలో ముంచారా? ఈ ప్రశ్న ఇప్పుడు కేంద్ర దర్యాప్తు సంస్థల ముందుంది. సీబీఐ ఇప్పటికే పలువురు సంబంధిత అధికారులు, డిప్యూటీ కమిషనర్లపై ప్రత్యేక విచారణ ప్రారంభించింది.

# అసలు ఈ సంజయ్ ఎవరు?

## మరోసారి భగ్గుమన్న జీవన్ రెడ్డి



**హైదరాబాద్, మహా :** ఎమ్మెల్యే సంజయ్ ఏ పార్టీనో నాకు తెలియదు?.. జగిత్యాలలో కలిసి పని చేయడానికి సంజయ్ ఎవరు?'' అని మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. గాంధీ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సంజయ్ ఏ పార్టీనో స్పీకర్ ని అడిగితే తెలుస్తదన్నారు. తాను చాలా సీనియర్ నేతను అని, తనకు జగిత్యాల డెవలప్మెంట్ పై అవగాహన ఉందని పేర్కొన్నారు. జగిత్యాలలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని ఆహ్వానించామని, అభివృద్ధి కి నిధుల ఇస్తానని పొంగులేటి చెప్పారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కుల, జనగణన చేస్తామనటం హర్షించదగ్గ విషయమన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర శాఖ కేంద్రానికి లెటర్ రాసేలా ఆర్.కృష్ణయ్య చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బలహీన వర్గాలకు సామాజిక న్యాయం కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ ముందు ఉంటుందన్నారు. కులగణన చేయడంతో బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని రాహుల్ గాంధీ ఆలోచన అని, ఆయన ఆలోచన ప్రకారం తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి కుల గణన చేసి మండలిలో, అసెంబ్లీలో ఆమోదం పొంది గవర్నర్ తో స్క్రూట్నీ కి ఆమోదం లభించిందన్నారు. ఆర్టికల్ 9వ షెడ్యూల్ లో చేర్చితే బలహీన వర్గాల విద్యార్థులకు, ఉద్యోగులకు 42 శాతం రిజర్వేషన్లు లభిస్తాయన్నారు. ఓబీసీ ల రిజర్వేషన్లు కూడా రాష్ట్రాల కు అనుగుణంగా చేపట్టాలని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

మహా పత్రిక

WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | మంగళవారం, హైదరాబాద్ | 20-05-2025

ANN తెలుగు

Z కేటగిరీ

# మందిని మల్పినోడే మొనగాడు!



- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్

**మందను మల్పినోడే గొల్ల' అన్నది తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ఒక నానుడి.అంటే గొర్రెల కాపరి తమ మందను జాగ్రత్తగా మేపుకుంటాడు.ఒక్క మేక కూడా లెక్క తప్పకుండా చూసుకుంటాడు.మందలోని ఒక్క మేక కూడా దారి తప్పిపోకుండా చూసుకుంటాడు.ఏ మేక లేదా గొర్రె తన మందలోనిదేనా,కాదా అన్నది ఆ గొర్రెల కాపరి చిటికెలో గుర్తించగలడు.'మందను మల్పడంలో కేసీఆర్ వ్యూహాలన్నిటినీ రేవంత్ రెడ్డి అవపోసన పట్టారు.అందుకే కేసీఆర్ వంటి మహాపర్వతాన్ని ఆయన పడగొట్టగలిగారు' అని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.ప్రజల్ని గొర్రెల మందతో పోల్చడం నా ఉద్దేశం కానే కాదు. ప్రజా సమూహాన్ని 'ఒక గొర్రెల కాపరి' తన మందను ఎట్లా మల్పుకుంటాడో,అదే తెలివిడితో 'జనసమూహాన్ని' కేసీఆర్ వైపు నుంచి తన వైపునకు సునాయాసంగా రేవంత్ తిప్పుకోగలిగారు.జనాన్ని కేసీఆర్ 'గుప్పిట్లో' నుంచి,కాంగ్రెస్ పార్టీ వైపునకు మళ్లించగలిగారు.**



> బిఆర్ఎస్ పార్టీతో తాడో పేడో తేల్చుకునేందుకు ఎమ్మెల్సీ కవిత సిద్ధమైనట్లు తెలుస్తోంది.మేడే సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కేసీఆర్ ఫోటో కనపడకపోవడం, ఆయన స్థానంలో ప్రొఫెసర్ జయశంకర్ ఫోటో దర్శనమివ్వడం ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. ఇటీవల బిఆర్ఎస్ రజతోత్సవ సభలో ఎదురైన అవమానంతో తగ్గేదేలే అన్నట్లు రాజకీయ ప్రయాణం ఉండబోతోందని కవిత చెప్పకనే చెప్పిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఆమె వేరే పార్టీలో చేరతారా లేక తెలంగాణ జాగృతి పేరుతో ఒంటరి పోరాటం చేస్తారా?అన్నది తెలియాల్సి ఉంది.

> హరీశ్ రావు ఎప్పటికీ కేసీఆర్ విధేయుడే కానీ కేటీఆర్ కు కాదు.తండ్రి పరపతి,ఇతర హంగులతో కేటీఆర్ నాయకుడయ్యారు. హరీశ్ రావు నాయకునిగా ఎదగడం,ఆయనకు పార్టీ శ్రేణుల్లో లభిస్తున్న ఆమోదం తన కష్టార్జితం. కేసీఆర్ మద్దతు ఉన్నప్పటికీ తనకు తాను 'ప్రత్యమ్నాయ' నాయకునిగా ఎదగడానికి,తన ప్రతిభ కారణం. అదే దారిలో కవిత కూడా ప్రయాణిస్తున్నారు.రాజీ లేని పోరాటానికి ఆమె సిద్ధపడ్డట్టు తాజా పరిణామాలు సూచిస్తున్నవి.

> ఎమ్మెల్సీ కవిత 'సామాజిక తెలంగాణ' పేరిట పేల్చిన బాంబు మామూలుగా పేలలేదు.దాని ప్రకంపనలు ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ ను,తెలంగాణ భవన్ ను కుదిపేశాయి.ఆమె లేవనెత్తిన పలు అంశాలు పార్టీలో చర్చకు దారితీశాయి.కవిత ప్రస్తుతం బిఆర్ఎస్ కార్యకలాపాల్లో 'రైజింగ్' లో ఉన్నారు.సామాజిక న్యాయం,సామాజిక తెలంగాణ నినాదాలు కేసీఆర్,కేటీఆర్ లకు రుచించడం లేదంటూ బిఆర్ఎస్ కు చెందిన ఆమె 'ప్రత్యర్థుల'కు అనుకూలంగా పనిచేస్తున్న ప్రధాన స్రవంతి మీడియా,పార్టీ 'ముఖ్యుని' ప్రాయోజిత మీడియా కొన్ని వార్తా కథనాలను వండి వార్చుతున్నాయి. ఈ పరిణామాలు ఆమెను తీవ్రంగా కలచివేస్తున్నవి. ''నాపై కుట్ర చేస్తున్న వారెవరో సమయం,సందర్భాన్ని బట్టి బయటకు చెబుతా'' అని కవిత హెచ్చరించడంతో పార్టీలో కలకలం రేగింది.

ఒక్కడిగా బయలుదేరి,ప్రజల్ని తన మాటతో, భాషతో,మాండలికపు పడికట్టుతో,మంత్ర ముగ్ధులను చేసి తన చుట్టూనే సమీకరించుకున్న వ్యక్తి కేసీఆర్.తెలంగాణ ఆకాంక్ష అగ్నికి ఆజ్యం పోసిన మనిషి కేసీఆర్.అట్లా 'తెలంగాణ'ను వశీకరణం చేసిన నాయకునిగా కేసీఆర్ కు లభించిన అరుదైన గౌరవాన్ని ఎవరూ తుడిచిపెట్టలేకపోవచ్చు.అయితే కేసీఆర్ సమ్మోహనశక్తి క్రమంగా తగ్గుతున్నట్టుగానో,మసకబారుతున్నట్టుగానో విశ్లేషణాలున్నవి.ఇక 'తెలంగాణ శ్రేణులందరినీ ఒక్క తాటిపైకి తీసుకు రాగలిగిన పార్టీ నాయకుడు ఎవరు?', 'మంద' ను మల్పగలిగిన వ్యక్తి ఎవరు ? అనే అంశాలపై విస్తృతంగా చర్చ జరుగుతోంది.కేటీఆర్,హరీశ్ రావు ,కవిత మధ్య తీవ్ర పోరాటమే జరుగుతున్నట్టు తాజా పరిణామాలు ధృవీకరిస్తున్నవి.

కేసీఆర్ రాజకీయ రిటైర్మెంట్ ప్రకటించనున్నారని కొన్ని సోషల్ మీడియా ప్లాట్ ఫార్మ్ లలో ప్రచారం జరుగుతోంది.ఈ ప్రచారంలో పూర్తిగా నిజం ఉండకపోవచ్చు,ఉండవచ్చు కూడా.తెలంగాణ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ ఓటమిని ఎదుర్కున్న నాటి నుంచి ఆ పార్టీ అధినేత కేసీఆర్ రాజకీయాలకు తాత్కాలిక బ్రేక్ తీసుకున్నారు. కేవలం ఫామ్ హౌస్ కు మాత్రమే పరిమితమవుతూ పార్టీ బాధ్యతలను, బిఆర్ఎస్ బరువును తన 'రాజకీయ వారసుడు' కేటీఆర్ చేతిలో పెట్టినట్టు పలు సంఘటనలు రుజువు చేస్తున్నవి. పార్టీ పూర్తి స్థాయి రాజకీయ వ్యవహారాలను కేటీఆర్ నడుపుతున్నారు.అలాగే కేటీఆర్ తో పాటుగా అటు సీనియర్ నాయకుడు,టిఆర్ఎస్ ఆవిర్భావం నుంచి కేసీఆర్ కు కుడి భుజంగా నిలిచిన హరీష్ రావు పార్టీ వ్యవహారాలలో చురుగ్గా పాల్గొంటున్నా ఆయన ఆ పార్టీ నుంచి బయటకు వెడతారనో,సొంత పార్టీ పెడతారనో వదంతులు ఊపందుకున్నవి.వాటిని ఆయన ఖండించారు.కేసీఆర్ మాటే తనకు శాసనం అనీ,ఒక వేళ కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పజెప్పినా తనకు అభ్యంతరాలు లేవని హరీశ్ రావు స్పష్టం చేశారు.

కేసీఆర్ మాటను తూచా తప్పకుండ పాటించే పార్టీ కార్యకర్తను అని వివరణ ఇచ్చారు. హరీష్ వ్యాఖ్యలతో త్వరలో కేసీఆర్ రాజకీయ రిటైర్మెంట్ ప్రకటించబోతున్నారనే ప్రచారానికి బలం చేకూరుతోంది. తన రాజకీయ వారసుడిగా కేసీఆర్ తన కొడుకు కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగించనున్నారన్న ప్రచారమూ నిజమేనని ఆ పార్టీ వర్గాలంటున్నవి.హరీష్ వ్యాఖ్యలతో ఇప్పటివరకు జరుగుతున్న ఊహాగానాలకు సమాధానం దొరికినట్లయ్యినట్లయిందన్న విశ్లేషణలు వస్తున్నవి.నిజంగానే కేటీఆర్ కు పూర్తి స్థాయి పార్టీ పగ్గాలు అప్పజెప్పినప్పుడు కానీ హరీష్ రావు 'అసలు ఎత్తుగడ' తెలిసే అవకాశం ఉంది. హరీశ్ రావు ఎప్పటికీ కేసీఆర్ విధేయుడే కానీ కేటీఆర్ కు కాదు.తండ్రి పరపతి,ఇతర హంగులతో కేటీఆర్ నాయకుడయ్యారు.హరీశ్ రావు నాయకునిగా ఎదగడం,ఆయనకు పార్టీ శ్రేణుల్లో లభిస్తున్న ఆమోదం తన కష్టార్జితం.కేసీఆర్ మద్దతు ఉన్నప్పటికీ తనకు తాను 'ప్రత్యమ్నాయ' నాయకునిగా ఎదగడానికి,తన ప్రతిభ కారణం.అదే దారిలో కవిత కూడా ప్రయాణిస్తున్నారు. రాజీ లేని పోరాటానికి ఆమె సిద్ధపడ్డట్టు తాజా పరిణామాలు సూచిస్తున్నవి.

హరీశ్ రావు,కవిత పార్టీకి కొరకరాని కొయ్యలుగా మారారని కేటీఆర్ అభిమానులు,ఆయన మద్దతుదారులు అంటున్నారని తెలుస్తోంది.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అగ్నికి ఆజ్యం పోశారు.కేటీఆర్ నాయకత్వంలోనూ పనిచేస్తానని హరీశ్ రావు చెప్పడంలో విశేషమేమీ లేకపోగా,హాస్యాస్పదంగానూ ఉన్నట్టు సీఎం వ్యాఖ్యానించారు.కేసీఆర్ కుటుంబంలో ఎవరి నాయకత్వంలో ఎవరు పనిచేసినా ప్రజలకు ఒరిగేది ఏమిటి అని రేవంత్ రెడ్డి అన్నారు.కొప్పుల ఈశ్వర్,రసమయి బాలకిషన్ వంటి దళిత నాయకులకు పార్టీ నాయకత్వ బాధ్యతలు ఎందుకు అప్పగించరు? అంటూ ముఖ్యమంత్రి రెచ్చగొట్టారు.రేవంత్ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ వైపు నుంచి స్పందన లేదు.ఖండన ముండనలు లేవు.''ఇది మా కుటుంబ వ్యవహారం'' అని సమర్థించుకునే అవకాశమూ లేదు.రాజకీయాలు వేరు.కుటుంబం వేరు. ప్రతిపక్ష నాయకునిగా ఉన్న కేసీఆర్ అసెంబ్లీకి ముఖం చాటేశారు.'' ఆయన స్థాయి మనుషులు అసెంబ్లీలో లేరు కాబట్టి,అసెంబ్లీ సమావేశాలకు రావద్దని నేనే ప్రతిపాదించా'' అని కేటీఆర్ వింత వాదన చేస్తున్నారు. ఇందులో ఇంకో మర్మం లేకపోలేదు.కేసీఆర్ అసెంబ్లీకి వస్తే తనకు ప్రాధాన్యం ఉండదని,గుంపులో గోవిందయ్యలా మారవలసి వస్తుందని కేటీఆర్ అనుకుంటూ ఉండవచ్చు.

బిఆర్ఎస్ గా మారిన పార్టీని ఇంతకాలం తన రాజకీయ వ్యూహాలతో ముందుకు తీసుకువెళ్లిన కేసీఆర్ పార్టీ ఓటమి బాధను ఒక వైపు ,విరిగిన తుంటి ఎముక బాధను మరో వైపు మోస్తూ ఫార్మ్ హౌజ్ కు పరిమితమయ్యారు.పార్టీని ప్రజల ముందుకు తీసుకువెళ్లే బాధ్యతను కేటీఆర్ సమర్థంగా నిర్వహించగలరా? అనే ప్రశ్న తలెత్తుతున్నది.ఉద్యమ కాలం నుంచి కేసీఆర్ తో పాటుగా పార్టీకి అండదండగా ఉంటున్న సీనియర్ నాయకుడు హరీష్ రావుకు కేటీఆర్ కు రాజీ కుదురుతుందా?లేదా ఇదివరకే రాజీ కుదిరిందా?ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల ఎంపిక నుంచి పోటీ చేసే స్థానాల వరకు అంతిమ నిర్ణయాధికారం కేసీఆరే తీసుకుంటూ వస్తున్నారు.పార్టీ తరపున ఎన్నికల బరిలో దిగుతున్న అభ్యర్థిని విజయం దిశగా తీసుకువెళ్ళడానికి చేపట్టే ప్రచార కార్యక్రమాల బాధ్యత నుంచి,కాంగ్రెస్ ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొడుతూ తీసుకోవాల్సిన చర్యల వరకు అన్ని అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించే వారు.కేసీఆర్ తన వాగ్ధాటితో సొంత పార్టీ నేతలనే కాదు ప్రత్యర్థి పార్టీ నాయకులను కూడా కట్టడి చేయడంలో ఆరితేరిన వ్యక్తి.ఎప్పుటికప్పుడు తన రాజకీయ వ్యూహాలను మార్చుకుంటూ ప్రత్యర్థి పార్టీలను ఇరుకునపెట్టగల సమర్థత కేసీఆర్ లో ఉందని పార్టీలో ఒక అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఆలోచనతో కూడిన ఆవేశంతో రాజకీయాలను కేసీఆర్ ముందుకు తీసుకువెళతారన్న చర్చ ఉన్నది.

కేసీఆర్ కు ఉన్నంత రాజకీయ అనుభవం కానీ,మాస్ లీడర్ షిప్ నైపుణ్యం కానీ, కేసీఆర్ తో పోల్చితే కేటీఆర్ కు లేవు.ప్రత్యర్థులను కట్టడి చేయగలిగేంత ఆవేశం,వ్యూహాలు కేటీఆర్ లో లేవు అనే అభిప్రాయం ఉన్నది.హరీష్ రావు,కేటీఆర్ తో సఖ్యత కష్టమేనన్న చర్చ ఉన్నది. బిఆర్ఎస్ పార్టీలో మూడు 'కుంపట్లు' కనిపిస్తున్నవి.బిఆర్ఎస్ పార్టీలోనే తన 'సొంత వర్గాన్ని' ఏర్పాటు చేసుకున్నట్టు హరీష్ రావుపై గతంలో ఆరోపణలున్నవి.పదేళ్ల అధికార వైభోగం అనుభవించిన బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు ఆ హంగు ఆర్భాటాలకు దూరంగా ఉండలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.తనకన్నా మాస్ ఫాలోయింగ్ హరీశ్ రావుకు ఎక్కువగా ఉన్న విషయం కేటీఆర్ కు తెలుసు.అందుకే రాజీకి దిగినట్లున్నది.

ఎమ్మెల్సీ కవిత 'సామాజిక తెలంగాణ' పేరిట పేల్చిన బాంబు మామూలుగా పేలలేదు.దాని ప్రకంపనలు ఎర్రవల్లి ఫార్మ్ హౌజ్ ను,తెలంగాణ భవన్ ను కుదిపేశాయి.ఆమె లేవనెత్తిన పలు అంశాలు పార్టీలో చర్చకు దారితీశాయి.కవిత ప్రస్తుతం బిఆర్ఎస్ కార్యకలాపాల్లో 'రైజింగ్' లో ఉన్నారు.సామాజిక న్యాయం,సామాజిక తెలంగాణ నినాదాలు కేసీఆర్,కేటీఆర్ లకు రుచించడం లేదంటూ బిఆర్ఎస్ కు చెందిన ఆమె 'ప్రత్యర్థుల'కు అనుకూలంగా పనిచేస్తున్న ప్రధాన స్రవంతి మీడియా,పార్టీ 'ముఖ్యుని' ప్రాయోజిత మీడియా కొన్ని వార్తా కథనాలను వండి వార్చుతున్నాయి.ఈ పరిణామాలు ఆమెను తీవ్రంగా కలచివేస్తున్నవి.''నాపై కుట్ర చేస్తున్న వారెవరో సమయం,సందర్భాన్ని బట్టి బయటకు చెబుతా'' అని కవిత హెచ్చరించడంతో పార్టీలో కలకలం రేగింది.

దేశంలో ఫాసిజం పెరుగుతోందని,మతతత్వ శక్తులు విజృంభిస్తున్నాయనీ ఇటీవలి కాలంలో కవిత మాట్లాడుతున్నారు.రాజకీయాధికారంలో బడుగు బలహీన వర్గాలకు తగిన వాటా లభించడానికి కులగణన అవసరమనీ అంటున్నారు.ఇవేవీ బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు,కేటీఆర్ కు నచ్చనివి అంటూ ఒక ప్రచారం సాగుతోంది.

ఆమె వైఖరి దూకుడుగా,పార్టీ పంథాకు భిన్నంగా కనిపిస్తుండడంతో 'పార్టీలో రాజకీయంగా తనను దెబ్బతీయాలనుకున్న వారిపై' కవిత పంజా విసరనున్నట్టుగా ఒక వాతావరణం కనిపిస్తోంది.హరీష్ రావు వలె కవిత సాధారణంగా 'రాజీ' పడే మనిషి కాదు.'లొంగుబాటు' వైఖరిని ప్రదర్శించే నైజమూ లేదు.ఆమె పొటెన్షియల్ నాయకురాలు కావడంతో,ఆమె ఏమి మాట్లాడినా ఖండించలేకపోతున్నారు,అలాగే సమర్థించలేకపోతున్నారు. కవిత వ్యూహంతో కేటీఆర్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నట్టు కొన్ని జిల్లాల బిఆర్ఎస్ కార్యకర్తల నుంచి సమాచారం అందుతోంది.బిఆర్ఎస్ పార్టీతో తాడో పేడో తేల్చుకునేందుకు ఎమ్మెల్సీ కవిత సిద్ధమైనట్లు తెలుస్తోంది.మేడే సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో కేసీఆర్ ఫోటో కనపడకపోవడం, ఆయన స్థానంలో ప్రొఫెసర్ జయశంకర్ ఫోటో దర్శనమివ్వడం ఇందుకు నిదర్శనంగా కనిపిస్తోంది. ఇటీవల బిఆర్ఎస్ రజతోత్సవ సభలో ఎదురైన అవమానంతో తగ్గేదేలే అన్నట్లు రాజకీయ ప్రయాణం ఉండబోతోందని కవిత చెప్పకనే చెప్పిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఆమె వేరే పార్టీలో చేరతారా లేక తెలంగాణ జాగృతి పేరుతో ఒంటరి పోరాటం చేస్తారరా?అన్నది తెలియాల్సి ఉంది.

గత కొన్ని రోజులుగా కవితపై సొంత పార్టీలోనే కుట్ర జరుగుతోంది.ఆమె చేపట్టిన ఏ కార్యక్రమాల్లోనూ పార్టీ నేతలు కనిపించడం లేదు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఒక 'ముఖ్యుని' ఆదేశాలనుసారమే నేతలు సైతం ఆమె కార్యక్రమాలకు హాజరుకావడం లేదన్న విమర్శలున్నవి. రాజకీయంగా పొంచి ఉన్న ముప్పును గ్రహించిన ఆమె తన భవిష్యత్ పై దృష్టిసారిస్తున్నారు.తాజాగా కవిత నివాసంలో మేడే వేడుకలను నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలుచర్చనీయాంశమయ్యాయి.''రాష్ట్రం సిద్ధించినా.. సామాజిక తెలంగాణ రాలేదు. ఇందుకోసం మేడే స్ఫూర్తిగా తీసుకుని మరో ఉద్యమం చేయాల''ని పిలుపునివ్వడం వెనుక ఆమె బిఆర్ఎస్ పై అసంతృప్తిగా ఉన్నట్లు తేలిపోయింది.తెలంగాణ వచ్చాకా పదేళ్లు బిఆర్ఎస్ అధికారంలో ఉంది.అయినా సామాజిక తెలంగాణ ఏర్పడలేదనే కవిత మాటలు బిఆర్ఎస్ కు అల్టిమేటం జారిచేసినట్టుగా సంకేతాలు కనిపిస్తున్నాయి.''నేను బిఆర్ఎస్ బలోపేతం కోసమే ఇప్పటికే 48 అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటించాను.నాపై కొందరు వ్యక్తులు దుష్ప్రచారానికి పూనుకుంటున్నారు'' అని ఆమె మీడియా చిట్ చాట్ లో అన్నారు.

''కవిత ఈ మధ్య చాలా వాస్తవాలు మాట్లాడుతున్నారు. ఇంటి వాళ్ళే కక్ష కట్టి పని చేస్తున్నారు అని చెప్పారు .ఏకాకి చేసే ప్రయత్నం చేస్తున్నారనే ఆవేదన కవితలో ఉంది.కవిత సొంత పార్టీ పెడితే మేము స్వాగతిస్తాం. కవిత తన అసంతృప్తి వెల్లడిస్తూ కేసీఆర్ కు లేఖ రాశారు. పార్టీలో గుర్తింపు లేకుండా పోతుందని ఆవేదన ఆ లేఖలో ఉంది.కుటుంబంలో అంతర్గత అంశాలపై లేఖలో ఉంది.

లేఖ రాయలేదని చెప్పమనండి.నేను వివరాలు బయట పెడతా.ఆమె ఆవేదనను బిఅరెస్ తొక్కిపెట్టింది''. అని పిసీసీ అధికార ప్రతినిధి సామ రామ్మోహనరెడ్డి అన్నారు.

కవిత,తన తండ్రి,పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కు 5 పేజీలతో కూడిన లేఖ రాశారని జరుగుతున్న ప్రచారాన్ని ఆ పార్టీ నాయకులెవరూ ఖండించడం లేదు. అలాంటి లేఖను రాశారో లేదో తెలియదు.కవిత నాయకత్వ ప్రతిభ గురించి కేసీఆర్,కేటీఆర్,హరీశ్ రావు,సంతోష్ జోగినపల్లి తదితరులకు బాగా తెలుసు.కనుక ఆమె గురించి బహిరంగంగా ఎవరూ వ్యాఖ్యానించేందుకు సాహసించడం లేదు.'సామాజిక తెలంగాణ' తమ పార్టీ నినాదమో కాదో చెప్పే ధైర్యమూ చేయడం లేదు.

కాగా మాట్లాడే మాటలు,చేసే చేతలు ఏవైనప్పటికీ,కెసిఆర్ పెద్ద ప్రమాదంలో ఉన్నారు.ఇంటా,బయటా అనేక సమస్యలు,సవాళ్లు ఆయనను చుట్టుముట్టాయి. ఎత్తుకు పై ఎత్తు వేయగలిగిన సామర్థ్యంతో పాటు తప్పుల మీద తప్పులు చేయగలిగిన చరిత్ర కూడా కేసీఆర్ కు ఉన్నట్టు సీనియర్ జర్నలిస్టు ఒకరు విశ్లేషించారు.దేశంలోని ప్రగతిశీల శక్తులు,మేధావులు,ప్రజాస్వామిక వాదులు భయపడుతున్న ఫాసిస్టు ప్రమాదంలో భాగంగానే కెసిఆర్,ఆయన పరివారం ఇబ్బందిలో ఉన్నారు.ఆత్మరక్షణ కోసమైనా, తెలంగాణ సహజీవన సంస్కృతి రక్షణ కోసమైనా,జాతీయస్థాయిలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమైనా,గట్టి పోరాటం చేయగలిగే నైతిక శక్తి బిఆర్ఎస్ లో లోపించింది.

ఒక రాజకీయ పార్టీ సిద్ధాంతాలు ఏమిటి,వారికి అధికారం సంక్రమించినప్పుడు వారు అనుసరించబోయే విధానాలు దేశాన్ని ఎటు తీసుకుపోతాయి వంటి అంశాలపై ప్రజాజీవితంలో ఉన్నవారికి అవగాహన ఉండాలి. 2009 లో ఇంకా ఎన్నికల ఫలితాలు వెల్లడి కాకముందే అద్వాణీని కలిసి అభినందించినప్పుడు కానీ, 2014 తరువాత పార్లమెంటులో అనేక నిర్ణయాల పై మద్దతు ఇచ్చినప్పుడు కానీ, కెసిఆర్‌కు భవిష్యత్ చిత్రపటం సాక్షాత్కరించలేదు.బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను బీజేపీ కొనుగోలు చేయడానికి కుట్రలు జరిగినా చివరకు ఆ కేసు కేసీఆర్ మెడకే చుట్టుకున్నది. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉండడం కానీ,బలమైన నాయకులు ప్రాంత స్థాయిలో ఎదగడం కానీ బిజెపి సహించదు. బలమైన కేంద్రం,బలహీన రాష్ట్రాలు అన్నది బిజెపి సిద్ధాంతం. వారు నమ్మే తీవ్ర జాతీయతకు ప్రాంతీయ ప్రయోజనాల వాదం వ్యతిరేకమైనది.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం కెసిఆర్ జీవన్మరణ పోరాటం చేయకతప్పడం లేదు.

''ఒకే ఒక్క పక్షి మాత్రమే డేగతో పోరాడేందుకు ధైర్యం చేస్తుంది.అదే కాకి! అది డేగ వెనకభాగంలో కూర్చుంటుంది.మెడ మీద కరుస్తుంది.తనతో పోరాడాలని అనిపించేస్తుంది!కానీ డేగ మాత్రం తల తిప్పి చూస్తూ సమాధానం ఇవ్వదు. ఫైట్ చేయదు.వాదించదు. ఎందుకంటే డేగకు ఫోకస్ ఉంది.కాకి కోసం శక్తిని వృథా చేయదు.డేగ ఓ నిర్దేశిత గమ్యానికి పయనిస్తుంది.రెక్కలను పూర్తిగా విప్పి ఎగురుతుంది.ఎత్తులు ఎక్కుతూనే ఉంటుంది.వెనుకే ఉన్న కాకి ఊపిరాడక చివరకు కింద పడిపోతుంది!మీ విజయాల వెనక చెవిలో కోరికల చప్పుడు చేసే కాకులు ఉంటాయి.మీకు నష్టం జరగాలని కోరుకునే వ్యక్తులు,మీ ఎదుగుదలకు అడ్డు కట్టాలనుకునే శక్తులు ఉంటాయి.వాళ్లతో తలపడి కాలాన్ని వృథా చేయకండి.వాళ్లను నాశనం చేయాలనుకోవద్దు.మీరు ఎత్తుకు ఎగిరిపోతే చాలు.మీ రెక్కలను విప్పండి.మీ లక్ష్యాన్ని సాధించేందుకు నేరుగా ఎగిరిపోండి. మీ ప్రయాణమే ప్రత్యర్థులకు ఉత్తమ సమాధానం''.అనే సూక్తి ఎక్కడో చదివాను.

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కూడా దూకుడుగా,తాను అనుకున్న దారిలో వేగంగా వెడుతున్నారు. ఆమె వ్యూహం ఏమిటో అంతుచిక్కక సొంత పార్టీ నాయకులు గాభరా పడుతున్నారు.ఆమెను రాజకీయంగా తొక్కి పారవేయడానికి అనేక మాయోపాయాలు సాగుతున్నవి.వాటిని కవిత లెక్క చేస్తున్న దాఖలాలు లేవు.తన గమ్యాన్ని నిర్దేశించుకొని డేగ వలె ఎత్తుకు ఎగిరిపోతున్నట్టుగా దృశ్యం కనిపిస్తున్నది.

కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నప్పుడు రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో బీఆర్ఎస్ చేరింది. అప్పుడు ఎమ్మెల్యేగా కూడా లేని హరీష్‌రావును మంత్రిని చేశారు.అలాగే హరీష్ కూడా మామకు నమ్మిన బంటు.మేనమామ పట్ల తన విధేయతను ఎన్నో సార్లు ప్రకటించారు. అదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే.మరోవైపు మాత్రం ఎప్పటికప్పుడు ఏదో ఒక రూపంలో ఆయన మీద రకరకాల పుకార్లు పుడుతూనే ఉన్నాయి.నాడు తెలంగాణ కోసం రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గం నుంచి టిఆర్ఎస్ మంత్రులు రాజీనామా చేశారు. ఆ తర్వాత కొంతమంది ఎమ్మెల్యేలతో కలిసి ఆయన కాంగ్రెస్‌లో చేరతారన్న ప్రచారం జరిగింది. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక చాలా హరీష్ కృషి చెప్పుకోదగినది. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు, రాజకీయ ఇబ్బందులు వచ్చినప్పుడు రకరకాల సంప్రదింపులతో ట్రబుల్ షూటర్‌గా పేరుంది. ఆయన మీద ప్రచారాలు మాత్రం ఆగడం లేదు.ఎప్పటికప్పుడు శీల పరీక్షకు నిలబడుతూ సమాధానం చెప్పుకోవాల్సి వస్తోంది. ప్రతి ఎన్నికల సమయంలో ఆయన పార్టీ మారతారన్న ప్రచారం గుప్పుమంటోంది. కేటీఆర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇచ్చినప్పుడు హరీష్ తీవ్ర వత్తిడిలో ఉన్నారని,ఇక కారు దిగేస్తారని ఓ రేంజ్‌లో చెప్పుకున్నారు. ఆ ప్రచారాన్ని హరీశ్ రావు ఖండించారు. కేసీఆర్ గీసిన గీత దాటను అని కుండ బద్దలు కొట్టేశారు. ఇక ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కూడా ట్రబుల్ షూటర్ మీద ప్రచారాలు ఆగలేదు.. కొంతమంది ఎమ్మెల్యేలను తీసుకుని ఆయన బీజేపీలోకి వెళతారంటూ సోషల్ మీడియాలో జోరుగా చర్చ జరిగింది. ఆ టైంలో కూడా హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. ఇక పార్లమెంటు ఎన్నికల సమయంలో సైతం అదే సీన్. బీజేపీ లేదా కాంగ్రెస్ ఏదో ఒక జాతీయ పార్టీలోకి వెళ్తారని ప్రచారం జరగడం,ఆయన ఖండించడం షరా మామూలే.బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల వేళ కూడా ఆయన మీద ఇదే ప్రచారం గతంలోకంటే ఉధృతంగా జరిగింది

హరీష్‌రావు కొత్త పార్టీ పెట్టబోతున్నారంటూ మరో ప్రచారం తెరపైకి వచ్చింది.దీనిపై పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హరీష్‌రావు పార్టీ మార్పు మీద ఏదో ఒక ప్రచారం జరగడం, ఆయన ఖండించడం జరిగిపోతున్నాయి.పార్టీ నాయకత్వాన్ని కేటీఆర్ కు అప్పగించాలని కేసీఆర్ నిర్ణయం తీసుకుంటే స్వాగతిస్తానని కూడా చెప్పారు. ఆయన మరో మాట లేకుండా వివరణ ఇస్తున్నా, ఇంకో ఆలోచన లేదని చెబుతున్నా అలాంటి ప్రచారాలు ఎందుకు చేస్తున్నారు? ఎవరు పుకార్లు పుట్టిస్తున్నారన్నది ప్రశ్న. హరీష్‌రావును అప్రతిష్ట పాలుజేయాలనుకుంటున్న సొంత పార్టీ వ్యక్తులే ఈ ప్రచారం వెనుక ఉన్న సంగతి హరీష్ కు తెలియనిది కాదు.తాజాగా కవిత వ్యాఖ్యలతో చెలరేగుతున్న వివాదంపై హరీష్, కేటీఆర్ మే 16,17 తేదీల్లో సమావేశాలు జరిపారు .ఈ సమావేశాలు హరీష్ నివాసంలో జరగడం ఒక విశేషం.పార్టీలో ఒక అధికార కేంద్రంగా మారే అవకాశమున్నందున కవితను 'ఎలా బయటకు పంపాలి' అని మేథోమథనం చేస్తున్నట్టు తెలియవచ్చింది.

ఎమ్మెల్సీ కవిత 'తెలంగాణ జాగృతి' కమిటీలు ప్రకంపనలు పుట్టిస్తున్నాయి.ఆమె నియమించిన కమిటీలలో బాధ్యులంతా బహుజన వర్గాలకు చెందిన వారే కావడం విశేషం.ఆమె సంధించిన 'సామాజిక తెలంగాణ' నినాదానికి అనుగుణంగానే ఆమె ఈ నియామకాలు చేశారు. అయితే త్వరలో జరగనున్న బిఆర్ఎస్ కమిటీల నియామకంలో 'కొత్త ఎజండా' ను కవిత ఖరారు చేసినట్లయింది.ఈ ప్రభావంతో పార్టీ కమిటీల్లోనూ ఎస్సి,బీసీలకు పెద్దపీట వేయవలసిన అనివార్యమైన పరిస్థితి ఏర్పడింది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
74369 39999


# ఆదర్శ నేత అవిశ్రాంత పోరాట యోధుడు

## పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళులు

### సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్

### ఆయన ఆశయ సాధన కోసం కమ్యూనిస్టులంతా కృషి చేయాలి

### అప్పుడే ఆయనకు నిజమైన నివాళులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత, సిపిఐఎం వ్యవస్థాపకులు, స్వాతంత్ర సమరయోధులు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని తుర్కయంజాల్ సిపిఎం పార్టీ శ్రేణులు, ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు, తుర్కయంజాల్ మున్సిపల్ కార్యదర్శి డి కిషన్ మాట్లాడుతూ... పుచ్చలపల్లి సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో జన్మించినప్పటికీ తన చిన్నతనంలోనే అంటరానితనం, కుల వివక్షత పైన పోరాటం చేసిన మానవతావాది అని అన్నారు. చదువుకునే రోజుల్లోనే స్వాతంత్ర పోరాటంలో పాల్గొని జైలు జీవితం గడిపిన గొప్ప త్యాగశీలి అని అన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల్ని కూడగట్టి అనేక ప్రజా ఉద్యమాలు నిర్మించారని అన్నారు. తాను ప్రజాప్రతినిధిగా కొనసాగినంత కాలం అటు చట్టసభల్లో ఇటు బయట ప్రజల పక్షాన పోరాడిన నికార్సైన కమ్యూనిస్టు అని కొనియాడారు. అణువణువునా జాతీయభావాల నింపుకొన్న నిజమైన దేశభక్తి గల వ్యక్తని అన్నారు. నేడు ప్రపంచీకరణ పేరుతో జరిగే ఆర్థిక వలసవాదం దేశాన్ని కబళిస్తున్న ఈ సందర్భంలో సుందరయ్య లాంటి నేతల అవసరం మరింత అవసరమని అన్నారు. బహుళ జాతి కంపెనీలు, రైతుల భూములను ఆక్రమిస్తున్నప్పుడు, విదేశీ పెట్టుబడులు కార్మికుల శ్రమను దోచుకుంటున్నప్పుడు, ఆర్థిక శాసనాల పేరిట మానవ హక్కులు విడిచిపెడుతున్నప్పుడు, సుందరయ్య జీవితం నేటి సమాజానికి ఎంతో బలం ఇస్తుందని, ఎదురు తిరిగే తెగవనిస్తుందని అన్నారు. ఈరోజు ప్రపంచీకరణలో నలిగిపోతున్న స్థానిక జీవన విధానాలకు మతోన్మాదంలో మగ్గుతున్న సామాజిక చైతన్యానికి ఆయన ఆశయాలు లక్ష్యాలు స్ఫూర్తి దాయకమని అన్నారు. సుందరయ్య ఆశయ సాధన కోసం కమ్యూనిస్టులంతా కృషి చేయాలని, అప్పుడే సుందరయ్యకి నిజమైన నివాళులర్పించిన వారమవుతమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ తుర్కయంజాల్ మున్సిపల్ కమిటీ సభ్యులు కే అరుణ్ కుమార్, నాయకులు బి శంకరయ్య, ఏ మాధవరెడ్డి, అంజయ్య, కుమార్, యాకయ్య, నాంపల్లి శంకర్, పరమేష్, శేఖర్ రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు అధికార దుర్వినియోగంపై విమర్శలు

## తూర్పులో అక్రమ కేసులు అరెస్టులకు భగ్గుమన్న స్వపక్షం, ప్రతిపక్షం

### పార్టీ గెలుపుకు కారణమైన కార్పొరేటర్ పై అక్రమ కేసు.. పార్టీలకు అతీతంగా మద్దతు

### గుండేటి ని పరామర్శించిన పలువురు నేతలు నాయకులు



**వరంగల్ మహా:** గత కొంతకాలంగా మంత్రి కొండా సురేఖ ఏదో విధంగా వివాదాల్లో చిక్కుకుంటున్నారు. రాష్ట్రంలో ఏ మంత్రికి రాని అపవాదులు, వివాదాలు వరంగల్ తూర్పు ఎమ్మెల్యే స్థానిక మంత్రి కొండా సురేఖకు వస్తున్నాయని అనడంలో అతిశయోక్తి లేదు. దీంతో సీఎంకు తలనొప్పి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆ పార్టీ నేతలు నాయకులే చెబుతున్న మాట. వరంగల్ తూర్పులో కొండా దంపతుల ఆధ్వర్యంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఓ రౌడీ షీటర్ రాజ్యమేలు తున్నాడని ఇతని కనుసన్నల్లోనే పోలీసులు పనిచేస్తున్నారని వారిని పావుల్ల వాడుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నాడని అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణల మధ్య గతంలో ఇతనికి ఉన్న గన్మెన్లను కూడా తొలగించడం జరిగింది. భూ దందాలు, సెటిల్మెంట్ల తో పాటు సొంత పార్టీ నాయకులపై నే కాకుండా అతని మాట వినకపోతే అమాయక ప్రజలపై ఇతర పార్టీ నాయకులపై కూడా అక్రమ కేసులు పెట్టిస్తున్నాడని స్వపక్ష, విపక్ష నేతలు నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. వరంగల్ తూర్పు లో మంత్రి అనుచర వర్గం తీరుతో రోజురోజుకు పెరుగుతున్న వర్గ పోరుతో పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని సొంత పార్టీ నేతలే తలలు పట్టుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం అధికార పార్టీ కాంగ్రెస్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ అక్రమ అరెస్టు తూర్పు నియోజకవర్గంలో కలకలం రేపింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ వీడని నేతలపై తూర్పులో పార్టీ గెలుపుకు కారణమైన కార్పొరేటర్ పై అక్రమ కేసులు పెట్టించడం కొండా దంపతుల వర్గపోరుకు సజీవ సాక్ష్యంగా నిలిచింది. ఓ.. బిసి నేత మరో బీసీ నేత పై అక్రమ కేసు పెట్టించడం కవ్వింపు చర్యలకు పాల్పడడం అధికారులు, అధికార పార్టీ మంత్రికి సాధ్యంగా కనిపిస్తుంది. వరంగల్ తూర్పులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరగా కొండా దంపతులు అనుచరగనం వర్గపోరుకు ఆజ్యం పోస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అక్రమ కేసులకు అండగా కొండా దంపతులకు అనుకూలంగా పోలీసులు నిలుస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. దశబ్దాలుగా పార్టీని నమ్ముకుని ఎన్నో ఆటుపోట్లకు ఏదురోడ్డి పార్టీకి అండగా నిలిచిన నాయకులపై సైతం అక్రమ కేసులు బానాయించడం పై స్వపక్షంలో ఆగ్రహ జ్వాలాలు రేకెత్తుతున్నాయి. ఆదివారం తాజాగా 20వ డివిజన్ కార్పొరేటర్ ఎన్నికల ముందు బిఆరెస్ నుండి కాంగ్రెస్ పార్టీ గూటికి చేరుకున్నాడు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండా సురేఖ విజయానికి కార్పొరేటర్ సామాజిక వర్గం, వ్యక్తిగత ఇమేజ్ కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి దోహదపడింది. ఈ విషయం అధికార, ప్రతీ పక్షాలు ఒప్పుకుని తీరాల్సిందే. ఉన్నట్టు ఉండి కార్పొరేటర్ అక్రమ అరెస్టు తూర్పు నియోజకవర్గంలో సంచలనం సృష్టించడం కొండా దంపతులకు రాష్ట్ర పార్టీకి తలనొప్పిగా మారింది. కార్పొరేటర్ పద్మశాలి సామాజిక వర్గం ఉమ్మడి జిల్లా నేతలు పార్టీలకు అతీతంగా పోలీస్ స్టేషన్ చేరుకోవడం కలకలం సృష్టించింది. సోమవారం బంద్ పిలుపునివ్వడం పార్టీలకు అతీతంగా ఖండించడం కొండా దంపతులకు, పోలీసులకు పెద్ద తలనొప్పిగా మారింది. మహిళా బాలత్కారం కేసులో అరెస్టు చేసిన పోలీసులు ఇద్దరు సొంత పూచికత్తుపై విడుదల చేయడం హాస్యాస్పదంగా మారింది. గతంలో బిఆర్ఎస్ కార్పొరేటర్ ల పైనే కాకుండా చివరకు సొంత పార్టీ సీనియర్ కాంగ్రెస్ నేతలపై, డివిజన్ అధ్యక్షుల పై పెట్టిన అక్రమ కేసులను చూసి పార్టీ నేతలు అభద్రత భావంలో పడుతున్నారని పార్టీ సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి కేసులకు తగిన సాక్ష్యాలు లేకపోవడంతో కోర్టులో కేసులు నిలవడం లేదనే వదంతులు కూడా వినిపిస్తున్నాయి. ఇటువంటి వాటిని ఉపేక్షించకుండా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం తక్షణమే చొరవ చూపి చర్యలు తీసుకోవాలని పార్టీ సీనియర్ నేతలు, నాయకులు కార్యకర్తలు వేడుకుంటున్నారు.

**కార్పొరేటర్ గుండేటి కీ పలువురి పరామర్శ**

ఆదివారం జరిగిన సంఘటనపై అధికార పార్టీ నలుగురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొరివి పరమేశ్వర్ తో పాటు పార్టీలకతీతంగా బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, పలువురు నేతలు నాయకులు, కార్యకర్తల సోమవారం 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ ను ఆయన నివాసంలో కలుసుకొని పరామర్శించారు.

# ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

## నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలసి అధికారులు, రైస్ మిల్లర్లతో ధాన్యం కొనుగోలు పై సమీక్ష.



**వరంగల్ మహా;** రైతులు నష్ట పోకుండా ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సోమవారం నర్సంపేట రైతు వేదికలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద తో కలసి అధికారులు, రైస్ మిల్లర్లతో నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్షించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ రబి కాలంలో నియోజకవర్గంలో ని 6 మండలాల్లో అధిక వరి దిగుబడి వచ్చిందని, ఇప్పటివరకు 40 శాతం ధాన్యం కొనుగోలు చేసారని అన్నారు. క్షేత్ర స్థాయిలో మండలాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి అధికారులు ధాన్యం నిలువ వివరాలు సేకరించి ,దాని ప్రకారం ప్రణాళికాబద్ధంగా లారీలను, హమాలీలను ఏర్పాటు చేసుకొని వేగవంతంగా మిల్లులకు తరలించాలని అన్నారు. రైస్ మిల్లర్లకు సామర్థ్యాన్ని బట్టి వెంటనే కేటాయింపులు చేయాలని అధికారులను ఆదేశించారు. కొంత మంది మిల్లర్లు కావాలని తరుగు పేరుతో రైతులను ఇబ్బం దులు పెడుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. ట్రక్ షీట్ ప్రకారమే తీసుకోవాలని కోతలు విధిస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. 1638 రకం ధాన్యం ను గ్రేడ్ ఏ క్రింద పరిగణించి వాటిని తిరస్కరించకుండ తీసుకోవాలని అన్నారు. ఎక్కువ నూకలు వస్తున్నాయని బాయిల్డ్ రైస్ క్రింద తీసుకోనుటకు అనుమతించాలని మిల్లర్లు ఎమ్మెల్యే కు తెలుపగా, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకొంటామని ఎమ్మెల్యే అన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజ ను ప్రభుత్వం కొనేందుకు సిద్ధంగా ఉందని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. జిల్లా కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో 1.07 మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 31.54 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశామన్నారు. , ఇంకను 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓపిఎం ఎస్ నమోదు వెంటనే చేయాలని, తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు పంపించాలని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిలువలను వెంటనే ఖాళీ చేసే ప్రయత్నం చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకూడదని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే నిర్దేశిత మిల్లులకు తరలించాలని, మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ అన్నారు. అవసరమగు లారీలు సమకూర్చాలని జిల్లా రవాణా అధికారిను కలెక్టర్ ఆదేశించారు. హమాలీల కొరత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల వద్ద సకాలంలో అన్‌లోడింగ్ చేసుకునేలా పర్యవేక్షించాలన్నారు.



# సెంచరీకి చేరువలో వినతులు

### ప్రజా ఫిర్యాదుల పరిష్కారం పై శ్రద్ధ వహించండి

### బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే

**వరంగల్ మహా;** గ్రీవెన్స్ ప్రజా ఫిర్యాదుల పరిష్కారం పై శ్రద్ధ వహించి వెంటనే వాటిని పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని మేయర్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా.....

1.ఇంజనీరింగ్....16
2.హెల్త్ & సానిటేషన్.....14
3.ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ)...07
4.టౌన్ ప్లానింగ్...56
5.మంచినీటి సరఫరా.......

6 మొత్తం..... 99 ఫిర్యాదులుగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, డి ఎఫ్ ఓ శంకర్ లింగం, ఇన్చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, హెచ్ ఓ లు రమేష్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, ఎం హెచ్ ఓ డా.రాజేష్, తదితరులు, పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల సత్వర పరిష్కారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ -24 , ఇతర శాఖలకు - 29, మొత్తం 53 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ ను వేగవంతం చేయాలని, ఈ నెల 25 లోపు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామాలలో, మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి కొరత ఏర్పడకుండా చూడాలని డీపీఓకు, మున్సిపల్ కమిషనర్లకు, మిషన్ భగీరథ అధికారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓఆర్ఆర్ పై ఘోర రోడ్డు ప్రమాదం

## అతివేగమే ప్రమాదానికి కారణం!.. ఆదిభట్ల సిఐ రాఘవేందర్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** బొంగులూరు ఓఆర్ఆర్ పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపాలిటీ, బొంగులూరు పరిధిలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ 12 వద్ద, మేడ్చల్ జిల్లా, ఈసీఎల్ నాగారం దత్త కాలనీకి చెందిన ఎస్ కె హిలాల్ (35) కారులో అతి వేగంగా వచ్చి సైడ్ ఇనుప డివైడర్ ను ఢీ కొట్టాడు. ఆ ఇనుప డివైడర్ కారు ముందు అద్దంలో నుంచి దూసుకెళ్లి, కారులో ప్రయాణిస్తున్న హిలాల్ కు గుచ్చుకోవడంతో, అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో సమాచారం అందుకున్న ఆదిభట్ల పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నామని సిఐ రాఘవేందర్ రెడ్డి వెల్లడించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

## వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్స త్య శారద,అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి, డిఆర్ఓ విజయలక్ష్మి వరంగల్ ,నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి ఉమారాణి లు,డిఆర్డిఓ కౌసల్య దేవి, జెడ్పీ సీఈవో రామ్ రెడ్డి గార్లు పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యల పై అర్జీదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి వారి సమస్యల పై దరఖాస్తులు సమర్పించారు. జిల్లా ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. పరిష్కరించలేని దరఖాస్తులను అందుకు కారణాలను దరఖాస్తుదారునికి తెలియపరచాల్సిందిగా జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారుల సూచించారు. ప్రజావాణి లో వివిధ శాఖల వారీగా 128 దరఖాస్తులు స్వీకరించగా, అందులో రెవెన్యూ సమస్యలపై 54, పిడి హౌసింగ్ మున్సిపాలిటీ7, దరఖాస్తులు రాగా, మిగతా శాఖలకు ఆసంబంధించిన 46దరకాస్తులు వచ్చాయని, వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేస్తూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, త్రాగునీటి సమస్య తదితర అంశాలపై జిల్లా యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డి సి ఓ నీరజ, డిపిఓ కల్పన, వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, సంబంధిత జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# యుద్ధానికి విరామమే తప్ప ముగియలేదు

## 'తిరంగా ర్యాలీ'లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



**కరీంనగర్, మహా:** యుద్దానికి విరామమే తప్ప ముగియలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. దేశానికి ఆపదొస్తే టెర్రరిస్టుల అంతూ చూసేందుకు సిద్ధంగా ఉన్నామని ఉద్ఘాటించారు. ఆపరేషన్ సింధూర్ తో మన సైనిక సత్తా యావత్ ప్రపంచానికి తెలిసిందన్నారు. పాకిస్తాన్ ప్రజల ప్రాణాలకు నష్టం లేకుండా ఉగ్రవాద శిబిరాలను ముట్టుపెట్టిన ఘనత మన సైనికులదేనని కొనియాడారు. నరేంద్ర మోదీ నాయకత్వానికి, భారత సైన్యానికి సంఘీభావంగా దేశవ్యాప్తంగా 'తిరంగా ర్యాలీ' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం కరీంనగర్ లోని గీతాభవన్ చౌరస్తా నుండి రాంనగర్ చౌరస్తా నుండి 'తిరంగా ర్యాలీ నిర్వహించారు. వేలాది మంది కార్యకర్తలు, ప్రజలు జాతీయ జెండాను చేతబట్టి ఈ ర్యాలీకి తరలివచ్చి ప్రధాని మోదీ నాయకత్వానికి, భారత సైన్యానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ ఏమన్నారంటే..... పహల్గాంలో అమాయక హిందువులపైన, ప్రజలపైన ఉగ్రవాదులు జరిపిన దాడి సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ ఆదేశాలతో భారత సైనికులు పాకిస్తాన్ లోని టెర్రరిస్టుల శిబిరాలను ధ్వంసం చేశారు. మోదీకి, సైన్యానికి సంఘీభావం తెలుపుతూ దేశవ్యాప్తంగా 'తిరంగా ర్యాలీ' నిర్వహిస్తున్నాం. అందులో భాగంగానే కరీంనగర్ లో నిర్వహించిన ర్యాలీకి భారీ ఎత్తున హాజరై సంఘీభావం తెలిపారు.



# ప్రజావాణికి 86 వినతులు


## అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**హన్మకొండ మహా;** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు అందించిన వినతులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత శాఖల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 86 వినతులను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను స్వీకరిస్తూ ఆ సమస్యలపై పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. వి. గణేష్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

## భూభారతి సమస్యలు పరిష్కరించాలి

### ప్రభుత్వ సొంత భవనాల మార్కింగ్ పూర్తి చేయాలి.. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్, మహా:** జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని, భూభారతి పోర్టల్ లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించారు. పైలెట్ గ్రామాల్లో జిల్లాలో 2027 ఇండ్లు మంజూరు అయ్యాయని, అన్ని ఇండ్లకు వెంటనే మార్కింగ్ చేసి నిర్మించేలా చూడాలని అన్నారు. మంజూరైన వారిలో అనర్హులు ఉంటే వారిని తొలగించి ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను ఆ స్థానాల్లో భర్తీ చేయాలని సూచించారు. ఇండ్లు మంజూరైనా నిర్మాణం వద్దనుకునే వారి స్థానంలో పేదలకు అవకాశం ఇవ్వాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా తహసిల్దార్ల లాగిన్లలో 329 భూభారతి దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, వాటన్నింటినీ తక్షణమే విచారించి పై అధికారుల లాగిన్ కి పంపించాలని ఆదేశించారు. అంగన్వాడీలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, వెటర్నటీ దవాఖానాలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాలను తక్షణమే తరలించాలని పేర్కొన్నారు. పంచాయతీ సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలం చూపాలని తహసీల్దార్లను ఆదేశించారు. స్థల ఎంపిక పూర్తయిన గ్రామాల్లో భవనాల నిర్మాణానికి మార్కింగ్ చేయాలని అన్నారు. రాజీవ్ యువ వికాసం బ్యాంక్ లింకేజీ ప్రక్రియను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయ్, డిఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మహేశ్వర్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి పవన్ కుమార్ తో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజావాణికి మొత్తం 319 దరఖాస్తులు రాగా వాటి పరిష్కారానికి అధికారులకు బదిలీ చేశారు.

# త్రివర్ణమయమైన ఓరుగల్లు!



**వరంగల్ మహా;** ఉగ్రవాద మూకల మదిలో అలజడి సృష్టించేలా, నగర నడిబొడ్డున కళకళలాడిన ఓరుగల్లు, భరతమాత కు జేజేలు కొడుతున్న జనసంద్రపు అలల నడుమ ఉప్పొంగిన దేశభక్తి, జాతీయవాదం. వరంగల్ నగర వాసుల అడుగు చప్పుడు తో ఉగ్రవాదుల గుండె అదిరిలా ఈ ర్యాలీ సాగింది.

**సిటిజన్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ**

వారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన తిరంగా యాత్ర లో రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్లు, రక్షణా రంగంలో పనిచేసిన నిపుణులు, విద్యార్థినీ విద్యార్థులు, కుల మత ప్రాంత భాష వయో భేషజాలతో సంబంధం లేకుండా ప్రజలందరూ ఐకమత్యంగా ఈ తిరంగా యాత్రను ఘనాతి ఘనవిజయం చేయడం జరిగింది. ఆపరేషన్ సింధూర్ తో పాకిస్తాన్ ఉగ్రవాదులను మట్టుబెట్టి, పాకిస్తాన్ దాడిని తిప్పి కొట్టి, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా భారత దేశ క్షేమం కోసం, భారతీయుల రక్షణ కోసం పోరాడిన వీర సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ, వందే మాతరం అంటూ తల్లి భారతి పాదాలను వరంగల్ వాసులు ముద్దాడినారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వారు మాట్లాడుతూ.. ఉగ్రవాదం పై ఉక్కుపాదం మోపుతూ మోడీ సర్కార్ పాకిస్తాన్ కు గట్టి సమాధానమే చెప్పిందన్నారు. ఆపరేషన్ సింధూర్ దాడిలో వందమందికి పైగా టెర్రరిస్టులు హతమయ్యారని భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ సక్సెస్ చేసినందుకు ఎంతో గర్వంగా ఉందని తెలిపారు.



# రూ.లక్ష ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే నాయిని

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా కాజీపేట బాపూజీ నగర్ కు చెందిన దిద్ది నిర్మల మోకాలు చికిత్స కోసం నిమ్స్ హాస్పిటల్ లో చేరడంతో స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వారికి చికిత్స కోసం 1,00,000 రూపాయల ఎల్ఓసి ని మంజూరు చేయించి సోమవారం ఎమ్మెల్యే బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితురాలి కుటుంబ సభ్యునికి ఎమ్మెల్యే ఎల్ఓసి కాపీని అందజేశారు. ఈ సందర్భంగా బాధితుని చికిత్స కోసం సహకరించిన ఎమ్మెల్యే కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

### సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు చెరువులు నింపేందుకు

## ఫీడర్ ఛానెల్స్ ఏర్పాటు చేయాలి..!

**మిర్యాలగూడ,మే 19 మహా :** నాగార్జునసాగర్ ఎడమకాలువ కింద వున్న అన్ని చెరువులు, కుంటలకు ఏడమ కాలువ కింద ఉన్న మేజర్, మైనర్ కాలువల నుండి ఫీడర్ ఛానెల్స్ ఏర్పాటు చేసి అన్ని చెరువులకు ఎప్పుడంటే అప్పుడు నేరుగా సాగర్ నీళ్లతో నింపు కోవడానికి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తంకుమార్రెడ్డికి సమర్పించిన లేఖలో కోరినట్టు తెలంగాణ మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు విలేఖరులతో సోమవారం మాట్లాడుతూ కోరారు. అక్కడక్కడ రైతులు ఎంతో శ్రమపడి కాల్వలు ఏర్పాటు చేసుకున్నారు. ఇతర తూముల నుంచి రైతుల పొ లాలనుంచి వాళ్లకు వచ్చే నీళ్లను మళ్లి ంచి,నానా కష్టాలు పడుతూ,కాలువలకు గండ్లు పెడుతూ, దొంగ తనంగా నో బతిమిలాడుకొనో, అటు సాగర్ కాలువ ఉద్యోగులతోను ఇటు సాటి రైతుల తోను తిట్లు తింటూ కేసుల పాలవుతు గడుపుతున్నారు. అటు అధికారులు కాని ఇటు ప్రజాప్రతి నిధులు కాని 60 ఏండ్ల పాలనలో పాలకులు ఏమి చేయలేక పోయారు. ఇది మన దౌర్భాగ్యం. పేరుకు చెరువులు వున్నా, సాగర్ నీళ్లు వస్తున్నా, చెరువుల కుంటల కింది, భూములకు నీళ్లు అందడం లేదు. వేలాది బోర్లు వేశారు విద్యుత్ అందక బోర్లల్లో నీళ్లు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సమైక్య సీమాంధ్ర పాలకులు రూ.4,400కోట్లు ప్రపంచ బ్యాంక్ నుంచి అప్పుగా తెచ్చి పనులు సక్రమంగా చేయలేదన్నారు. గుత్తేదారులు బాగుపడ్డారన్నారు. ఆ డబ్బులతో టికెట్లు, ఓట్లు కొని నాయకులయ్యారన్నారు. ఆ తర్వాత వచ్చిన తెలంగాణ ఇంటి పార్టీ కూడా పదేళ్లు అలాగే గడిపింది. కాల్వలు పట్టించుకోలేదన్నారు. చొరవ తీసుకుని అదికారులతో చర్చించి సాగర్ ఆయకట్టు కింది అన్ని నియోజక వర్గాల్లోని అన్ని చెరువులు కుంటలు నింపటానికి వీలుగా



సాగర్ ఎడమ కాలువ మేజర్, మైనర్ కాలువల నుండి ఫీడర్ ఛానల్స్ ఏర్పాటు చేసి చెరువులకు నీళ్లు వచ్చేలా యుద్ధ ప్రాతిపాదికనా వెంటనే చేయించగలరన్నారు. ఈ సారి ఎండలు బాగా వుండే అవకాశంవుంది చెరువుల్లో చేపలకు పశువులకు గ్రామాల్లో ప్రజలకు నీళ్లు దొరికేలా చూడాల్సిందిగా కోరారు. చెరువు కింద పొలాలకు కూడా నీళ్లు అందేలా చూడగలరన్నారు. పేరుకు చెరువులు వున్నా, సాగర్ నీళ్లు వస్తున్నా, కాల్వ చివరి భూములకు నీళ్లు అందడం లేదన్నారు. పొలాలను బీళ్లుగా వదిలేయడమో లేదా నానా కష్టాలు పడి బోర్ల మీద ఆధార పడటమో చేస్తున్నారన్నారు. తక్షణమే స్పందించి చెరువులకు కుంటలకు తూములు ఏర్పాటు చేయాలన్నారు. ఆయకట్టు కింద 4 నియోజక వర్గాల్లో 30 ఏండ్లుగా కోదాడ హుజూర్ నగర్ ఉత్తం కుమార్ అధీనంలో, 40 ఏండ్లుగా మిర్యాలగూడ, నాగార్జున సాగర్ రెండు జానారెడ్డి అధీనంలో వున్నాయని మరిచిపోవద్దన్నారు. ఈ 60 ఏండ్ల లో 40 ఏండ్లు కాంగ్రెస్ పార్టీనే పరిపాలించిందని మారవొద్దన్నారు. మీరిద్దరు క్యాబినెట్ మంత్రులు అనికూడా మరవొద్దన్నారు.

# గూడు కోసం గొప్పలు చెప్పి..
# గోడు మిగిల్చారు..!

### పదేళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేక పోయారు

**- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్ నగర,మహా:** పేద ప్రజల గూడు కోసం గొప్పలు చెప్పి ఏది మిగిల్చకుండా గత పాలకులు అన్యాయం చేశారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కంకణబద్ధులై ఉన్నామని అందులో భాగంగానే నిరుపేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని మున్సిపల్ పరిధిలోగల 3, 4, 19, 20, 21 వార్డులలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితర స్థానిక నాయకులతో కలిసి ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా వార్డులలో అనేకమంది లబ్ధిదారుల ఇళ్ల స్థలాల వద్దకు వెళ్లి భూమి పూజ నిర్వహించారు పలుగు పారా పట్టి మట్టిని తీశారు. అనంతరం ఆయా కార్యక్రమాలను ఉద్దేశించి ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు పేదల గుడు కోసం ఎన్నో గొప్పలు చెప్పి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నియోజకవర్గంలో ఇవ్వలేదని విమర్శించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేద ప్రజలకు గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేరిచేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గానికి 3500 ఇల్లు ప్రభుత్వం కేటాయిస్తుందని ఆయా గ్రామాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసి ఇందిరమ్మ గృహాల శంకుస్థాపనకు శ్రీకారం చుట్టమన్నారు. ఇచ్చిన మాటలు నిలబెట్టుకోవడానికి తాము ముందుకు వస్తున్నామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద రైతు కుటుంబం నుండి వచ్చారని నిరుపేదల బడుగు బలహీన వర్గాల సబ్బండ వర్గాల కష్టనష్టాలు తెలిసిన ఒక సామాన్య వ్యక్తిగా వారు కలలుగన్న కలల సౌధం ఇందిరమ్మ గృహం అని భావించి నిరుపేదలకు ఇందిరమ్మ గృహాలు మంజూరు చేశారని గుర్తు చేశారు. తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పచేసి ఆగం చేశారని ఘాటుగా విమర్శించారు. అప్పులను అధిగమించి కష్టనష్టాలను ఓర్చుకొని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు.



**డబుల్ బెడ్రూం ఇళ్ల అసంపూర్తి పనులకు రూ. 7 కోట్లు**

గత పాలకులు సృష్టించిన ఆర్థిక విధ్వంసం నుండి ఇప్పుడిప్పుడే కోలుకొని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ఓర్చుకొని ముందుకు సాగుతుంటే కొందరు అవాకులు చావాకులు మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు ఎన్నో గొప్పలు చెప్పి గూడు లేకుండా పేదలకు గూడు మిగిల్చారని విమర్శించారు. గత పది ఏళ్లలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా పేదలకు పంచలేదని అన్నారు. నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు కిటికీలు, తలుపులు లేవని విద్యుత్ సౌకర్యం మంచినీటి సౌకర్యం కూడా లేదని అన్ని అసంపూర్తిగా చేసి పోయారని పేదలకు 10 ఏళ్ల నుండి గొప్పలు చెప్పుకొని కేవలం వారిని ఓటు బ్యాంకుగా మార్చుకున్నారే తప్ప వారికి ఎలాంటి ప్రయోజనం చేకూర్చలేదని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ఈ ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల అసంపూర్తి నిర్మాణాలను పరిశీలించి జిల్లా కలెక్టర్ తదితర అధికారులతో మాట్లాడడం జరిగిందని ఈ పనుల కోసం ఏడుకొండల రూపాయలు ప్రభుత్వం కేటాయించిందని త్వరలోనే పనులు పూర్తి చేసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. మున్సిపల్ పరిధిలో ఎంతమంది అర్హులు ఉంటే అంతమందికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని అదేవిధంగా ఇందిరమ్మ గృహాల నిర్మాణాలకు కూడా పూర్తి స్థాయిలో సహకరించమని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం ఆయా వార్డులలో ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ కు ఘనంగా స్వాగత సత్కారాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి,శ్రీనివాస్ నేతలు అగ్గనూర్ బస్వం, చెంది తిరుపతి రెడ్డి, రఘు నాయక్, జ్యమద్ ఖాన్, ఇబ్రహీం,మురళి మోహన్(అప్పి), కొప్పునూరి ప్రవీణ్,రమేష్,రవి కుమార్, యాదగిరి యాదవ్, శేఖర్, శ్రీనివాస్ రెడ్డి, మాధువలు, తుపాకుల శేఖర్,శ్రీహరి గౌడ్,కృష్ణ, రాయికల్ శ్రీనివాస్, సీతారాం, నవీన్, ఖదీర్, మంగ అశోక్, నీరటి వాసు, మన్నే రవి, రాజు, గడ్డమీద రమేష్, మనీష్, అన్వర్,శివ కుమార్, మున్సిపల్ రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

## నిధులు మాయం చేసిండ్రు డ్రైనేజ్ అట్లనే ఉంచిండ్రు...!!

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

**మిర్యాలగూడ,మే 19 మహా :** మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజీ కాలువల క్లీనింగ్ పేరిట బడ్జెట్ లో లక్షలు కేటాయించి నిధులు మాయం చేసిన గత పాలకులు డ్రైనేజీ పూడికలను అట్లనే ఉంచి... ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడే పరిస్థితి తెచ్చారని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న డ్రైనేజీ పూడికతీత పనులను స్వయంగా పరిశీలించి మాట్లాడారు. గతంలో పూడిక పేరిట లక్షలు ఖర్చు చేశారని ప్రస్తుతం మున్సిపాలిటీ జేసీబీ లు, ఇతర వాహనాలను వినియోగించి డ్రైనేజీ కాలువలను క్లీన్ చేపిస్తున్నామని చెప్పారు. మున్సిపల్ నిధుల దుర్వినియోగంపై లెక్కలన్నీ బయటికి తీస్తామన్నారు. మున్సిపల్




నిధులను పక్కదారి పట్టించే అధికారులపై, కాంట్రాక్టర్లపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, సానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటరమణ ఉన్నారు.

### ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే

## నిర్దాక్షిణ్యంగా కూల్చివేతలు చేపడతాం

**రాజేంద్రనగర్, మహా:** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్ హిల్స్ కాలనీలో స్థానికుల ఫిర్యాధు మేరకు హైడ్రా అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య సోమవారం కూల్చివేతలు చేపట్టారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్ హిల్స్ కాలనీలో హైడ్రా అధికారులు గతంలో పార్కు స్థలాలు ఆక్రమణ గురైన స్థలాలను పరిశీలించారు. పూర్తి నిర్ధారణ తర్వాత ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు జెసిపి సహాయంతో కూల్చి వేశామన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలు కబ్జా చేయాలని ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి స్థలాలను కబ్జా చేసే ప్రయత్నం చేస్తే భూకబ్జా కేసులు నమోదు చేస్తామని హైడ్రా అధికారులు హెచ్చరించారు. డాలర్ హిల్స్ కాలనీ వాసులు పార్కు స్థలాలను ఎవరైనా కబ్జాకు పాల్పడితే హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.



## కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలి



**విశాల శ్రావణ్ రెడ్డి**

**షాద్ నగర,మహా:** గ్రామాల్లో కలిసికట్టుగా పండుగలు జరుపుకోవాలని, సంస్కృతి సంప్రదాయాలను కాపాడడంతో పాటు ఐక్యతగా వర్ధిల్లాలని రంగారెడ్డి జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కౌన్సిల్ జిల్లా మాజీ చైర్మన్, కేశంపేట మాజీ జెడ్పిటిసి విశాల శ్రావణ్ రెడ్డి దంపతులు పేర్కొన్నారు. ఫరూఖ్ నగర్ మండలంలోని వెలిజర్ల గ్రామంలో బొడ్రాయి పండుగ, శివాలయ పునర్నిర్మాణం ధ్వజస్తంభ ఏర్పాటు కార్యక్రమాలకు విశాల శ్రావణ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి ఆహ్వానం పలికి సన్మానం చేశారు. పూజల అనంతరం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందిన నాడే గ్రామాల్లో శాంతి వాతావరం నెలకొంటుందని గ్రామం సర్వతముఖాభివృద్ధి చెందుతుందని వారు అభిప్రాయపడ్డారు. గ్రామ పండుగ కోసం తమన ఆహ్వానించినందుకు గ్రామ పెద్దలకు ప్రజలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు తదితరులు హాజరయ్యారు..

### తీవ్రవాద దాడులకు భారత సైన్యం

## సరైన రీతిలో సమాధానం చెప్పింది

**బీజేపీ జిల్లా అధ్యక్షులు రాజభూపాల్ గౌడ్**




**రాజేంద్రనగర్, మహా:** రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. తిరంగా యాత్రపై ఎవరిపై ముఖ్య నాయకులతో కలిసి సమావేశం పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు రాజు భూపాల్ గౌడ్ మాట్లాడుతూ సరిహద్దులు దాటకుండా, పాకిస్తాన్ తీవ్రవాదుల, స్థావరాలను అంతమొందించే శక్తి భారత సాధించింది, పెల్గాం దాడులను ఖండిస్తూ ప్రతి కార్య చర్యగా పాకిస్తాన్ లో ఆపరేషన్ సిందూర్ ద్వారా తీవ్రవాదులకు గుణపాఠం చెప్పిన భారత త్రివిధ దళాలకు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కి సంఘీభావంగా హైదరాబాద్ లో తిరంగా యాత్ర నిర్వహించాలని జిల్లా కమిటీ నిర్ణయించారు. భారత సైన్యం పాకిస్తాన్ పై దాడి చేసివిజయ పతాకం ఎగరేసిందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాలు అందించిన సేవలకు కృతజ్ఞతగా భారతదేశ ఐక్యతను చాటారు. పాకిస్తాన్ తీవ్రవాదులకు సహకారం ఆపేంతవరకు నీటి సమస్య పరిష్కరించబడదు. నీరు కావాలంటే తీవ్రవాదులను అంతమొందించాల్సిందే. భారత ప్రభుత్వం రక్షణ విభాగాన్ని మరింత బలోపేతం చేసింది. సైన్యానికి కావలసిన ఆయుధాలను అందిస్తుంది. ఆపరేషన్ సింధూర్ లో వాడిన యుద్ధ పరికరాలు స్వదేశీ పరిజ్ఞానంతో కలిగినవని మరోసారి పాకిస్తాన్ ను హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా బిజెపి ఆధ్వర్యంలో మే 20వ తేదీన శంషాబాద్ లో అంబేద్కర్ విగ్రహం నుండి తిరంగా యాత్ర లో బిజెపి నాయకులు ప్రతి ఒక్క భారతీయ పౌరులు బిజెపి కార్యకర్తలు పాల్గొనాలన్నారు. మన దేశ సైనికుల పోరాట పటిమను కీర్తిస్తూ, భారత దేశంపై ప్రేమను చాటుతూ ప్రతి ఒక్కరూ ఈ తిరంగా యాత్రలో పాల్గొనాలని మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ప్రేమ్ రాజ్, జిల్లా మాజీ అధ్యక్షులు అంజన్ కుమార్ గౌడ్, వై శ్రీధర్, మల్లారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, కుమురయ్య, తోకల శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ గుప్తా బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవ్

**అబ్దుల్లాపూర్మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి హెచ్చరిక**

**అబ్దుల్లాపూర్మెట్,మహా:** ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని అబ్దుల్లాపూర్మెట్ తహసీల్దార్ సుదర్శన్రెడ్డి తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలో కబ్జాకు గురైన భూములను సర్వే చేసినట్లు తెలిపారు. ఈ సర్వేలో 865.17 ఎకరాల ప్రభుత్వ భూములను సర్వే చేయగా.. ఇందులో 379.25 ఎకరాలు గుర్తించినట్లు తెలిపారు. తారామతిపేట, సుర్మాయిగూడ, కుంట్లూరు, తుర్కయంజాల్, కవాడిపల్లి, పసుమాముల, అనాజ్పూర్ తదితర గ్రామాలలో సర్వే చేశామని వెల్లడించారు. తక్కువ విస్తీర్ణంలో కబ్జాకు గురైన గ్రామాల భూములను గుర్తించి.. ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పేర్లు చెప్పి.. ఎవ్వరైనా కబ్జాలకు పాల్పడితే... కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే, కలెక్టర్లు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే అనాజ్పూర్ సర్వే నెంబర్ 281కు సంబంధించిన సీలింగ్ భూముల్లో 92 ఎకరాలు కబ్జాకు గురైనట్లు తెలిపారు. ఇందిరాసాగర్, వేముల కత్వలకు అనుకూని ఓ ప్రైవేట్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ క్రమంలో కొండలను, గుటలను తొలగించే ప్రక్రియలో బ్లాస్టింగ్ చేయడం వలన రాళ్లు, మట్టి కుప్పలు ఎగసిపడి ఇందిరాసాగర్, వేములకత్వలలో పడడంతో ఫిర్యాదులొచ్చాయి. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సర్వే చేసి అందులో పడిన రాళ్లను, మట్టిని తొలగించే విధంగా చర్యలు



చేపట్టామన్నారు. అదే విధంగా బాటసింగారం సర్వే నెంబర్ 10లో 250 ఎకరాల ప్రభుత్వం ఉంటుందని వివరించారు. ఇందులో 10/95లో అక్రమ వెంచర్ చేస్తున్నట్లు సమాచారం రావడంతో.. అందులో నిర్మించిన ఇళ్లను, గుడిని కూల్చివేశామని తెలిపారు. ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించే లేదన్నారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజలందరికీ రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. మండల పరిధిలో మొత్తం 14,327 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అందులో మండల పరిషత్ నుంచి 3787, పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ నుంచి 4439, తుర్కయంజాల్ మున్సిపాలిటీ నుంచి 5079, ఆన్లైన్ (మీ సేవ) ద్వారా 1022 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రేషన్ కార్డుల గురించి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివాసించే వారి ఆదాయం రూ. 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో నివాసించేవారి ఆదాయం రూ.2.5 లక్షలు మించకూడదన్నారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్లకు లాగిన్ ఐడీ ఇవ్వడం జరిగింది.

## ధాన్యాన్ని ప్రభుత్వానికి అమ్మండి

**ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించవద్దు**


షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్

**షాద్ నగర,మహా:** షాద్ నగర్ నియోజకవర్గంలో రైతాంగం తమ ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాలని ప్రైవేట్ వ్యాపారులకు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ సూచించారు. సోమవారం షాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు స్థానిక పాలకవర్గం సభ్యులతో కలిసి మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ అవగాహన కల్పించారు. ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యాన్ని వికరించవద్దని ప్రభుత్వానికి ఇస్తే క్వింటాలుకు రూ.2350 తో పాటు 500 తెలంగాణ ప్రభుత్వం బోనసిస్తుందని బాబర్ తెలిపారు. మార్కెట్ యార్డులో డైరెక్టర్లు కరుణాకర్, మల్లేష్, భరత్ లాహోటి తదితరులతో కలిసి రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్ యార్డులో రైతులు పెంటయ్య లక్ష్మయ్య సేవ్య కృష్ణయ్య ముత్యం రెడ్డి తదితర రైతులతో పాలకవర్గం సభ్యులు మాట్లాడారు. ప్రభుత్వానికి ధాన్యం ఇవ్వడం ద్వారా మద్దతు ధర కలుగుతుందని ప్రైవేట్ వ్యాపారులకు ఇవ్వడం వల్ల ఇష్టం సారంగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా మార్కెట్ యార్డులో ప్రైవేట్ వ్యాపారులను కూడా కమిటీ సభ్యులు హెచ్చరించారు. ప్రభుత్వ మద్దతు ధరకు తక్కువగా ధాన్యం తీసుకోవద్దని సూచించారు. ఒకవేళ రైతులను ఇబ్బందులకు గురిచేస్తే లైసెన్సులు క్యాన్సల్ చేస్తామని హెచ్చరించారు. రైతులకు ఇలాంటి ఇబ్బందులు ఎదురైనా మర్డర్ కమిటీ సభ్యులను సంప్రదించాలని తమకు ఫోన్ చేయాలని కోరారు. అదేవిధంగా రైతులు తమ ధాన్యం మార్కెట్ యార్డుకు తీసుకువచ్చేటప్పుడు తేమశాతం 17% ఉంచకుండా తీసుకురావాలని సరైన మద్దతు ధర పొందాలని సూచించారు. కొంతమంది రైతులు మార్కెట్ యార్డులో వ్యాపారస్తులతో ఉన్న సత్సంబంధాల వల్ల ధాన్యాన్ని సులువుగా చెప్తున్నారు అని కొంత వ్యక్తిగత అప్పులు ఇతర సమస్యలను చూపించి వారికి ధాన్యాన్ని అప్పజెప్తున్నారని ఇలాంటి వాటికి స్వస్తి చెప్పి ప్రభుత్వ మద్దతు ధర వచ్చే విధంగా ధాన్యాన్ని తక్కువకు అమ్ముకోకుండా ప్రభుత్వానికి ఇవ్వాలని మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితర కమిటీ సభ్యులు సూచించారు. అనేక మంది రైతులతో మార్కెట్ పాలకవర్గం మాట్లాడుతూ వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పించారు..



## ఆధ్యాత్మిక ఐక్యతనే గ్రామాలకు శోభ

**మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ**



**షాద్ నగర, మహా:** ఆధ్యాత్మిక తత్వంతోనే గ్రామాల్లో ఐక్యత వెల్లివిరిస్తుందని, ఆధ్యాత్మిక ఐక్యతతోనే గ్రామాల్లో శోభ వెల్లివిరుస్తుందని, స్నేహభావం పెంపొందిస్తుందని పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరుక్ నగర్ మండలం వెలిజర్ల గ్రామ బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట, గ్రామ శివాలయ దేవాలయ పునర్నిర్మాణం తదితర వేడుకలకు పాలమూరు పార్లమెంటు సభ్యులు డీకే అరుణ హాజరయ్యారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు డీకే అరుణతో పాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, మాజీ జెడ్పిటిసి మచ్చ సుధాకర్ రావు, షాద్ నగర్ పట్టణ అధ్యక్షుడు హరి భూషణ్, బిజెపి యువ నాయకులు వంశీకృష్ణ, మల్చలం మురళి, చెట్ల వెంకటేష్, మోహన్ సింగ్, శ్యాంసుందర్ రెడ్డి, కుడుముల బాలరాజ్, ఇస్నాటి శ్రీనివాస్, గిరిజన నాయకులు లష్కర్ నాయక్, రంగయ్య గౌడ్, ఎదిరా రాజు, బోయ అశోక్ మిద్దె గణేష్ మహేష్ అనిల్ కుమార్ గౌడ్ రాజు నాయక్ కృష్ణ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. గ్రామాలు శివాలయాన్ని పునర్నిర్మాణం చేయడం సంతోషకరమైన విషయమని గ్రామంలో బొడ్రాయి ప్రతిష్టాపన ఎంతో ముఖ్యమని తెలిపారు. గత పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఈ గ్రామంలో భారతీయ జనతా పార్టీకి మంచి మెజార్టీ లభించిందని ఈ సందర్భంగా డీకే అరుణ ధన్యవాదాలు తెలిపారు.

## అతిపెద్ద సోలార్ ప్రాజెక్టుకు రిలయన్స్ ఏర్పాట్లు



భూటాన్ పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేసేందుకు రిలయన్స్ పవర్ ఆ దేశానికి చెందిన గ్రీన్ డిజిటల్ ప్రైవేట్ లిమిటెడ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా 500 మెగావాట్ల సామర్థ్యంతో దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టును అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందుకు రూ.2,000 కోట్ల పెట్టుబడితో భూటాన్ పెట్టుబడి సంస్థ డ్రక్ హోల్డింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ (డీహెచ్ఐ)తో కలిసి జాయింట్ వెంచర్((5050)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**క్లీన్ ఎనర్జీ విస్తరణ**

భూటాన్ చాలాకాలంగా జలవిద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచ అగ్రగామిగా నిలుస్తుంది. ఈ రంగం దాని ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదం చేస్తుంది. అయినప్పటికీ సౌర విద్యుత్‌ను విస్తరిస్తూ పునరుత్పాదక ఇంధన రంగాన్ని వైవిధ్యపరచడంలో కీలకంగా వ్యవహరిస్తోంది. సౌరశక్తిని పెంచుకోవడం ద్వారా భూటాన్ మరింత స్థిరమైన ఇంధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ప్రయత్నిస్తోంది. రిలయన్స్ పవర్ ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం బిడ్డింగ్ ప్రక్రియను ప్రారంభించింది. ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిధులను సమీకరిస్తోంది. ఈ జాయింట్ వెంచర్ ప్రాంతీయ ఇంధన భద్రతను పెంచుతుందని, సంప్రదాయ శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని, దక్షిణాసియాలో భూటాన్‌ను క్లీన్ ఎనర్జీ హబ్‌గా నిలుపుతుందని పరిశ్రమ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## లంచ్ బ్రేక్‌లో బ్యాంకింగ్ సర్వీసులు నిలిపేస్తారా..?





బ్యాంకింగ్ సర్వీసుల కోసం చాలామంది నిరంతరం బ్యాంక్ బ్రాంచ్‌లకు వెళ్తుంటారు. మధ్యాహ్న భోజన సమయంలో చాలా ప్రభుత్వ కార్యాలయాలు తాత్కాలికంగా మూసివేయడం గమనిస్తుంటాం. అయితే బ్యాంకులు కూడా మధ్యాహ్నం భోజన సమయంలో మూసివేస్తారని లేదా తాత్కాలికంగా సేవలు నిలిపేస్తారని చాలామంది భావిస్తుంటారు. దాంతో బ్యాంకులో ఏదైనా పనులుంటే లంచ్‌బ్రేక్ తర్వాత వెళ్దామని అనుకుంటారు. కానీ నిబంధనల ప్రకారం బ్యాంకులకు ప్రత్యేకంగా లంచ్ బ్రేక్ ఉండదు. మరి బ్యాంకు సిబ్బంది ఏ సమయంలో భోజనం చేస్తారనే అనుమానం వస్తుంది కదూ. అయితే కింది వివరాలు చదవాల్సిందే.

భారతీయ రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం మధ్యాహ్నం సమయంలో బ్యాంకు సిబ్బంది షిఫ్ట్‌ల వారీగా భోజనం చేయాల్సి ఉంటుంది. అంతేగానీ పూర్తి బ్యాంకు సేవలు నిలిపేసి లంచ్‌కు వెళ్లకూడదు. కాబట్టి మధ్యాహ్నం బ్యాంకు పని ఉన్నవారు నిరభ్యంతరంగా బ్యాంకుకు వెళ్లవచ్చు. అయితే భోజన సమయం బ్యాంకు, బ్రాంచిను అనుసరించి మారుతుంది. సాధారణంగా మధ్యాహ్నం 1:00 గంటల నుంచి 3:00 గంటల మధ్య భోజన సమయం ఉంటుంది. ఈ సమయంలోనూ వినియోగదారులకు నిరంతర సేవలను అందిస్తారని గుర్తుంచుకోవాలి.

## అగ్ని ప్రమాదంలో నష్టపోయారా?

### ఇన్సూరెన్స్ క్లెయిమ్ ప్రాసెస్ ఇదే..




అసలే వేసవి కాలం.. భానుడి భగభగలు భారీగా ఉన్నాయి. ఇలాంటి సమయంలోనే సాధారణంగా అగ్ని ప్రమాదాలు, షార్ట్ సర్క్యూట్‌లు జరుగుతుంటాయి. ఇటీవల హైదరాబాద్ పాతబస్తీలోని 'గుల్జార్‌హౌస్'లో జరిగిన అగ్ని ప్రమాదంలో.. ప్రాణ నష్టంతోపాటు ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదం ఘటనపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణం ఏమిటనేది స్పష్టంగా వెల్లడికావాల్సి ఉంది. కాగా, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు సంబంధీకుల ప్రాణనష్టాన్ని ఎలాగో పూడ్చలేరు. కానీ ఆస్తి నష్టాన్ని ముందుగానే తీసుకున్న ఇన్సూరెన్స్ ద్వారా కొంత భర్తీ చేయవచ్చు. ఇలాంటి సందర్భంలో బీమా ఎలా క్లెయిమ్ చేయాలో నిపుణులు సూచిస్తున్నారు.

**ఫైర్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయడం ఎలా**

బీమా కంపెనీకి సమాచారం అందించాలి: అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే మీ బీమా ప్రొవైడర్‌కు సమాచారం ఇవ్వండి. అవసరమైతే, అత్యవసర ఖర్చుల కోసం ముందస్తు ఆర్థిక సహాయాన్ని అభ్యర్థించండి. సంఘటన జరిగిన తేదీ, సమయం, స్థలం వంటి ముఖ్యమైన వివరాలను అందించడంతో పాటు.. ఎంత నష్టం జరిగిందో అంచనా వేయండి.

**నష్టాన్ని డాక్యుమెంట్ చేయండి:**

అగ్నిప్రమాదం జరిగిన తరువాత.. స్థలాన్ని శుభ్రపరచడానికి ముందు.. అక్కడ పరిసరాలకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు తీయండి. కాలిన వస్తువులను పారవేయకూడదు. భీమా కంపెనీ స్పందించడానికి ముందే.. రిపేర్ చేయడం వంటి చేయకూడదు.

**క్లెయిమ్ ఫైల్ చేయండి:**

ఫైర్ ఇన్సూరెన్స్ క్లెయిమ్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో లేదా బీమా కంపెనీ కార్యాలయంలో సబ్మిట్ చేయండి. మీ ఫైర్ ఇన్సూరెన్స్ పాలసీ కాపీ, నష్టాన్ని తెలియజేసే ఫోటోలు & వీడియోలు, పాడైపోయిన వస్తువుల జాబితా.. వాటి విలువను తెలిపే రసీదులు లేదా ఇన్వాయిస్‌లు, ఫైర్ బ్రిగేడ్ నివేదిక వంటి అవసరమైన డాక్యుమెంట్స్ అందించాల్సి ఉంటుంది.

**సర్వేయర్‌తో సహకరించండి:**

ఇన్సూరెన్స్ కంపెనీ నష్టాన్ని అంచనా వేయడానికి ఒక సర్వేయర్‌ను నియమిస్తుంది. సర్వేయర్‌కు పూర్తిగా సహకరించండి. వారికి అవసరమైన సమాచారం & పత్రాలను అందించండి. నష్టపోయిన ఆస్తిని పరిశీలించడానికి వారికి అనుమతి ఇవ్వండి.

**క్లెయిమ్ సెటిల్మెంట్:**

మీ క్లెయిమ్ ఆమోదం పొందిన తరువాత.. పాలసీ నిబంధనల ప్రకారం నష్టపరిహారం కంపెనీ చెల్లిస్తుంది. అయితే చెల్లింపు విధానం గురించి సంస్థ మీకు తెలియజేస్తుంది.

## స్లీపర్ ప్రయాణికులకు ఇక ఆ సౌకర్యం లేదు..




మీరు తరచుగా రైలులో ప్రయాణిస్తుంటారా? అందులోనూ వెయిటింగ్ లిస్ట్ టికెట్లపైనే ఎక్కువగా ఆధారపడుతుంటారా? అయితే మీరు తెలుసుకోవలసిన ముఖ్యమైన అప్డేట్ ఒకటి ఉంది. ఇండియన్ రైల్వే తాజాగా ఒక పెద్ద మార్పు చేసింది. స్లీపర్ క్లాస్ టికెట్లు ఇకపై ఖాళీగా ఉన్నప్పటికీ ఫస్ట్ ఏసీకి అప్‌గ్రేడ్ అవ్వవు. ఇప్పటి వరకు వెయిటింగ్ లిస్ట్ టికెట్లు ఉన్న ప్రయాణికులకు ఒక వేళ సీట్లు అందుబాటులో ఇతర క్లాస్‌లలో సీట్లు కేటాయించేవారు. ఇకపై ఆ సౌకర్యం ఉండదు. ఆటో అప్‌గ్రేడ్ విధానం ఎలా పనిచేస్తుందో తాజగా జారీ చేసిన సర్క్యులర్‌లో రైల్వే బోర్డు స్పష్టం చేసింది. మీరు ఒక నిర్దిష్ట తరగతిలో టికెట్ బుక్ చేసుకుంటే అందులో సీట్లు అందుబాటులో లేకపోతే మీ టికెట్ వెయిటింగ్ లిస్ట్‌లో ఉంటుంది. ఒకవేళ ఇతర ఉన్నత తరగతులలో లభ్యత ఉంటే మీ సీటు ఆటోమేటిక్‌గా ఆ క్లాస్‌లోకి అప్‌గ్రేడ్ అవుతుంది. అయితే ఇది రెండు తరగతులకు మాత్రమే.

**సీట్ల అప్‌గ్రేడ్ ఇలా..**

స్లీపర్ క్లాస్ ప్రయాణీకులకు, అప్‌గ్రేడ్ కొత్త క్రమం ఇలా ఉంటుంది..

**2ఎస్→ 3ఈ → 3A → 2A → 1A**

అయితే 2ఏ ప్రయాణీకులను మాత్రమే 1ఏ (ఫస్ట్ ఏసీ)గా అప్ గ్రేడ్ చేయవచ్చని భారతీయ రైల్వే స్పష్టం చేసింది. మీరు స్లీపర్ లేదా 3ఈలో ఉంటే ఇకపై ఫస్ట్ ఏసీకి అప్‌గ్రేడ్ కాలేరు.

**సీటింగ్ క్లాస్ కోచ్‌లతో అప్‌గ్రేడ్ క్రమం ఇలా ఉంటుంది..**

**2S → VS → CC → EC → EV → EA**

ఇక్కడ కూడా సీసీ (చైర్ కార్) టికెట్లు బుక్ చేసుకున్న వారు మాత్రమే ఈసీ, ఈవీ లేదా ఈఏ వంటి ప్రీమియం తరగతులకు అప్ గ్రేడ్ అయ్యేందుకు అర్హులు. అలాగే సీటింగ్ క్లాస్, స్లీపర్ క్లాస్‌లకు మధ్య ఎలాంటి అప్‌గ్రేడ్‌కు అవకాశం ఉండదు.

**అప్‌గ్రేడ్ కోసం ఏమైనా చేయాలా?**

ఐఆర్‌సీటీసీలో టికెట్ బుక్ చేసుకునేటప్పుడు 'ఓకే విత్ ఆటో అప్‌గ్రేడ్' అనే ఆప్షన్ ఉంటుంది. ఇక్కడ "యస్" క్లిక్ చేస్తే, మీ టిక్కెట్ అర్హత అప్‌గ్రేడ్‌కు పొందుతుంది. "నో" ఎంచుకుంటే, అప్‌గ్రేడ్ కాదు. ఒక వేళ మీరు ఏ ఆప్షన్‌నూ ఎంచుకోకపోతే సిస్టమ్ దానిని డిఫాల్ట్‌గా "యస్" గా తీసుకుంటుంది.

# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL




## అగ్నిపర్వతం బద్దలు

### అధికారుల్లో టెన్షన్.. కారణం ఇదే..

**పడాంగ్:** ఇండోనేషియాలో అగ్నిపర్వతం బద్దలైంది. అగ్నిపర్వతం ధాటికి దాదాపు ఆరు కిలోమీటర్ల ఎత్తుకు మందంపాటి బూడిద ఎగసి పడింది. దీంతో, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని.. మాస్కులు ధరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇక, దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. వివరాల ప్రకారం.. తూర్పు ఇండోనేషియాలోని లెవోటోబి లకిలకిలో ఉన్న అగ్ని పర్వతం సోమవారం ఉదయం బద్దలైంది. ఈ సందర్భంగా అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఫ్లోర్స్ దీవిలోని మౌంట్ లెవొటోబి లకిలకిలో విస్ఫోటనాలు ఏర్పడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ అధిపతి ముహమ్మద్ వాఫిద్ పేర్కొన్నారు. ఈ సమయంలో వర్షాలు పడితే అగ్నిపర్వతం చుట్టూ ఉన్న ప్రాంతాలకు సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అన్నారు.

ఇదే సమయంలో అగ్నిపర్వతం నుంచి దాదాపు 6 కి.మీ ఎత్తుకు మందంపాటి బూడిద ఎగసిపడుతున్నట్లు తెలిపారు. అగ్నిపర్వతం విస్ఫోటనం చెందడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. త్వరగా గ్రామాలను ఖాళీ చేయించి, అక్కడి నివాసితులను ఇతర ప్రాంతాలకు తరలించడానికి చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు తెలిపారు. సమీప గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని.. మాస్కులు ధరించి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## సముద్రగర్భంలో పెను విస్ఫోటం!



అగ్నిపర్వతం బద్దలైనప్పుడు నిప్పులు చిమ్ముతూ లావా నింగిలోకి ఎగసిపడటం, విపరీతంగా ధూళి సమీప గ్రామాలపై దుమ్ము దుప్పటి కప్పేయడం టీవీల్లో చూసే ఉంటారు. వీటికి పూర్తిభిన్నమైన అగ్నిపర్వతం అతి త్వరలో బద్దలుకానుందని ఖగోళ శాస్త్రవేత్తలు ప్రకటించారు. అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలోని ఆస్టోరియా నగర తీరానికి 300 మైళ్ల దూరంలో పసిఫిక్ మహాసముద్రం లోపల ఈ అగ్నిపర్వతం దాగి ఉంది. దీని పేరు యాక్సియల్ సీమౌంట్. భూ ఉపరితలం మీద కాకుండా పసిఫిక్ మహాసముద్రం ఉపరితలానికి 1.4 కిలోమీటర్ల లోతులో ఉండటమే ఈ అగ్నిపర్వతం ప్రత్యేకత.

**ఎందుకంత ప్రత్యేకత?**

ఈ అగ్నిపర్వతం రెండు భూ పలకలు ఢీకొనే చోట ఏర్పడింది. పసిఫిక్ భూ పలక, జువాన్ డీ ఫ్యూకా భూ పలకలు తరచూ అత్యంత స్వల్పంగా కదులుతుంటాయి. ఈ క్రమంలో ఇవి పరస్పరం తగులుతూ భూమి ఉపరితల పొరల కదలికలకు కారణం అవుతున్నాయి. వీటి సమీపంలో ఉన్న ఈ అగ్నిపర్వతం త్వరలో బద్దలయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో తేలింది.

ఒరెగాన్ స్టేట్ యూనివర్సిటీలోని హ్యాట్‌ఫీల్డ్ మెరైన్ సైన్స్ సెంటర్‌లో పరిశోధకుడైన బిల్ చాడ్విక్ ఈ వివరాలను వెల్లడించారు. ''భూకేంద్రంలో ద్రవరూపంలోని శిలలు అగ్నిపర్వతం ద్వారా బయటకు వస్తాయి. ఈ శిలాద్రవం (మాగ్మా) వెంటనే సముద్ర జలాలకు తగిలి చల్లబడుతుంది. ఈ క్రమంలో అక్కడి సముద్ర జలాలు వేడెక్కుతాయి'' అని చాడ్విక్ చెప్పారు.

వేల కొద్దీ భూకంపాలు! ''అగ్నిపర్వతం ఎత్తు కేవలం 3,300 అడుగులు. కానీ అత్యంత క్రియాశీలంగా తయారైంది. ఇటీవలికాలంలో శిలాద్రవం బయటికొచ్చే అవకాశాలు ఎక్కువయ్యాయి. భూమి కంపిస్తోంది. అగ్నిపర్వతం తాజా స్థితిని తెల్సుకునేందుకు మేం సమీప ప్రాంతం దాకా కేబుల్ వ్యవస్థ ద్వారా భూకంప తీవ్రతలను కనిపెట్టే ఏర్పాట్లుచేశాం'' అని ఆయన చెప్పారు. ''అగ్నిపర్వతం బద్దలయ్యే ముందు భూమి వందల సార్లు కంపిస్తుంది.

ఇక అగ్నిపర్వతం బద్దలైన సందర్భాల్లో వేల సార్లు కంపిస్తుంది. 2015 ఏప్రిల్‌లో చివరిసారిగా అగ్నిపర్వతం బద్దలైంది. అప్పుడు విపరీతంగా శిలాద్రవం బయటకు ఎగజిమ్మింది. అప్పుడు 24 గంటల వ్యవధిలో ఈ ప్రాంతంలో 10,000 చిన్నపాటి భూకంపాలు వచ్చాయి. ఈసారి కూడా అదే స్థాయిలో భూమి కంపించే వీలుంది'' అని 'యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ స్కూల్ ఆఫ్ ఓషనోగ్రఫీ'లో మెరైన్ జియోఫిజిసిస్ట్, ప్రొఫెసర్ విలియం విల్‌కుక్ స్పష్టంచేశారు. జీవవైవిధ్యానికి బాసట అగ్నిపర్వతం బద్దలైనప్పుడు భారీ స్థాయిలో శిలాద్రవం మహాసముద్రజలాల్లో కలిసిపోతుంది.

ఈ శిలాద్రవంలో ఎన్నో రకాల మూలకాలు ద్రవరూపంలో ఉంటాయి. ఇవన్నీ సముద్రజలాల్లో సమ్మిళితమై అక్కడి సూక్ష్మజీవులకు ఆహారంగా మారతాయి. ఈ సూక్ష్మజీవులపై ఆధారపడిన చిన్న జలచరాలు, వాటిని ఆహారం తీసుకునే చేపలు.. ఇలా ఆహార చక్రం సదా సవ్యంగా కొనసాగేందుకు అగ్నిపర్వతం పరోక్షంగా సాయపడుతోంది. అత్యంత వేడితో సెగలు కక్కే మాగ్మా సముద్ర ఉపరితలానికి ఎగసిపడగానే అక్కడ జీవులు కొన్ని చనిపోయినా తర్వాత మాత్రం అక్కడ జీవరాశి పెరుగుదలకు దోహదపడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సముద్రంలో జీవం మనుగడకు అగ్నిపర్వతాలు సైతం తమ వంతు సాయం చేస్తున్నాయని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో మెరైన్ జియోలజీ, జియోఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ డెబీ కెల్లీ వ్యాఖ్యానించారు.

## పాక్‌కు ఐఎంఎఫ్ మరో 11 షరతులు

### భారత్‌తో పెట్టుకుంటే మీకే సమస్య అంటూ చురకలు



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌కు బెయిల్ ఔట్ ప్యాకేజీ నిధులు విడుదల చేసే విషయంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్) 11 కొత్త షరతులు విధించింది. అలాగే భారత్‌తో ఉద్రిక్తతలు పెంచుకోవడం తగదని హితవు పలికింది. ఉద్రిక్తతలు పెంచుకొంటే మీకే ఎక్కువ సమస్యలు వస్తాయని తేల్చిచెప్పింది. ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయని, సంస్కరణ లక్ష్యాలను సాధించడం కష్టమవుతుందని తేల్చిచెప్పింది. బిలియన్ డాలర్ల(రూ.8,540 కోట్లు) రుణానికి సంబంధించిన నిధులు పొందాలంటే షరతులకు కట్టుబడి ఉండాల్సిందేనని తేల్చిచెప్పింది. తాజాగా విధించిన 11 షరతులతో కలిపి పాకిస్తాన్‌పై విధించిన ఐఎంఎఫ్ షరతుల సంఖ్య 50కి చేరుకోవడం గమనార్హం. రూ.17.6 ట్రిలియన్ల బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం తెలపాలని, విద్యుత్ బిల్లులపై రుణ సర్వీసింగ్ సర్‌చార్జి పెంచాలని, మూడేళ్లు దాటిన పాత కార్ల దిగుమతిపై ఆంక్షలు ఎత్తివేయాలని ఐఎంఎఫ్ పేర్కొంది. మొత్తం బడ్జెట్‌లో రూ.1.07 ట్రిలియన్ల సొమ్మును అభివృద్ధి కోసం కేటాయించాలని నిర్దేశించింది. పాక్‌లోని నాలుగు ప్రావిన్సుల్లో కొత్త వ్యవసాయ ఆదాయపు పన్ను చట్టాలని అమలు చేయాలని తేల్చిచెప్పింది.

## బైడెన్‌కు ప్రొస్టేట్ క్యాన్సర్.. స్పందించిన ట్రంప్, కమలాహారిస్



**వాషింగ్టన్:** అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ (Joe Biden) క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. బైడెన్ ప్రొస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తాజాగా ఆయన కార్యాలయం వెల్లడించింది. ఇటీవల ఆయనకు జరిపిన ఆరోగ్య పరీక్షల్లో క్యాన్సర్ నిర్ధరణ అయినట్లు చెప్పుకొచ్చింది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు ట్రంప్ స్పందిస్తూ.. బైడెన్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. వివరాల ప్రకారం.. అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ప్రొస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఇటీవల బైడెన్‌కు లక్షణాలు కనిపించడంతో పరీక్షలు నిర్వహించగా ఆయన ప్రొస్టేట్‌లో చిన్న కణతి ఏర్పడినట్లు గుర్తించారు. దీంతో, పరీక్షల్లో క్యాన్సర్ నిర్ధారణ అయ్యింది. ఈ మేరకు ఆయన కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ క్యాన్సర్ తీవ్రత ఎక్కువగా ఉందని అందులో వెల్లడించింది. దీనికి సంబంధించి చికిత్స అందించే అంశంపై బైడెన్ కుటుంబసభ్యులు వైద్యులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. ఈ నేపథ్యంలో అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ స్పందించారు. బైడెన్ క్యాన్సర్ అనే విషయం తనను కలచి వేసిందని ట్విట్టర్ వేదికగా పేర్కొన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో బైడెన్ కుటుంబానికి తాము అండగా ఉంటామని, ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. బైడెన్ పోరాట యోధుడని పేర్కొన్న ఆమె.. ఈ క్యాన్సర్‌ను ఆయన ధైర్యంగా ఎదుర్కొంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు.. బైడెన్‌కు క్యాన్సర్ నిర్ధారణ కావడంపై ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఈ సందర్భంగా ట్రంప్.. 'జో బైడెన్‌కు క్యాన్సర్ నిర్ధారణ కావడం దురదృష్టకరం. ఈ విషయం తెలిసి నేను, మెలానియా చాలా బాధపడ్డాం. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను' అని చెప్పుకొచ్చారు.



# సూర్య - వెంకీ అట్లూరి కొత్త సినిమా ప్రారంభం

కోలీవుడ్ హీరో సూర్య, దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న సినిమా పెట్టాలెక్కింది. సూర్యకు రెట్రో, వెంకీ అట్లూరికి లక్కీ భాస్కర్ చిత్రాలు మంచి విజయాన్ని ఇచ్చాయి. ఇప్పుడు వారిద్దరూ కలిసి ఒక ప్రాజెక్ట్‌ను తాజాగా ప్రారంభించారు. తాజాగా ఈ సినిమా పూజా కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ దీనిని నిర్మిస్తున్నారు. ఇందులో మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుంది. జీవీ ప్రకాశ్ సంగీతం అందించనున్నారు. హిట్ ఫిల్మ్ 'సార్' (2023) (తమిళంలో 'వాతి'), దుల్కర్ సల్మాన్‌తో 'లక్కీ భాస్కర్' సినిమాల కోసం ఇతర భాషలకు చెందిన హీరోలను ఎంపిక చేసుకున్న దర్శకుడు వెంకీ అట్లూరి.. ఇప్పుడు మళ్లీ తమిళ హీరో సూర్యతో మరో సినిమా ప్లాన్ చేయడం విశేషం. త్వరలో షూటింగ్ ప్రారంభించి వచ్చే ఏడాది ప్రారంభంలోనే ఈ సినిమా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# స్టార్ డైరెక్టర్ సినిమాలో శోభితకు ఛాన్స్

నాగచైతన్యతో పెళ్లి తర్వాత ఇప్పుడిప్పుడే పలు కొత్త సినిమాలకు నటి శోభిత ధూళిపాళ ఓకే చెబుతుంది. పలు అందాల పోటీల్లో పాల్గొన్న ఆమె టాప్ మోడల్‌గా గుర్తింపు పొందారు. అలా పలు వాణిజ్య ప్రకటనల్లో నటించిన శోభిత 2016లో రామన్ రాఘవన్ 2.0 అనే హిందీ చిత్రం ద్వారా నటిగా రంగప్రవేశం చేశారు. ఆ తర్వాత తెలుగులో మేజర్ చిత్రంలో నటించి మంచి గుర్తింపు పొందారు. అలా హిందీ, తెలుగు, మలయాళం చిత్రాల్లో నటించిన శోభిత 2022లో మణిరత్నం సినిమా పొన్నియిన్ సెల్వన్ 1, 2 చిత్రాల్లో వానతి అనే పాత్రలో నటించి పేరు తెచ్చుకున్నారు. అదేవిధంగా హాలీవుడ్‌లో మంకీ మాన్ చిత్రంలో నటించి పాన్ వరల్డ్ నటిగా పేరు తెచ్చుకున్నారు. తాజాగా మరోసారి తమిళ ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. దర్శకుడు పా రంజిత్ దర్శకత్వం వహిస్తున్న వెట్టువన్ చిత్రంలో హీరోయిన్‌గా ఆమె నటిస్తున్నట్లు తెలిసింది. ఇంతకుముందు అట్టకత్తి, కబాలి, సార్పట్టా పరంపరై వంటి భారీ చిత్రాలను తెరకెక్కించిన పా. రంజిత్ ఇటీవల విక్రమ్ కథానాయకుడుగా తంగలాన్ చిత్రం చేశారు. తాజాగా వట్టువన్ అనే చిత్రాన్ని రూపొందిస్తున్నారు. గోల్డెన్ రేష్మియా ఫిలిమ్స్‌తో కలిసి నీలం స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఇందులో అట్టకత్తి దినేష్ కథానాయకుడుగా, ఆర్య ప్రతి నాయకుడిగా నటిస్తున్నారు. ఈ చిత్రం గ్యాంగ్ స్టర్స్ ఇతివృత్తంతో రూపొందుతున్నట్లు సమాచారం. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ మొదటి షెడ్యూల్ ప్రారంభమైంది. ప్రస్తుతం కారైక్కుడి ప్రాంతంలో చిత్రీకరణ జరుపుకుంటోంది. ఈ చిత్రంలో శోభిత ధూళిపాళ నటిస్తున్న పాత్ర ఏమిటి అన్నది ఆసక్తికరంగా మారింది.



## అనారోగ్యం బారిన పడ్డ
# టాలీవుడ్ హీరోయిన్

అప్పట్లో తెలుగులో పలు సినిమాల్లో హీరోయిన్ గా చేసిన పూనమ్ కౌర్.. ప్రస్తుతం రాజకీయాలు అంటూ తిరుగుతోంది. ఇది కాకుండా ఎప్పుడో ఏదో ట్వీట్ వేస్తూ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తూ ఉంటుంది. అలాంటిది ఇప్పుడు తాను అనారోగ్య సమస్యతో బాధపడుతున్నానని, అందువల్లే ఇలా మారిపోయానని చెప్పుకొచ్చింది. తాజాగా ఓ ప్రైవేట్ ఈవెంట్ లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి పూనమ్ కౌర్.. ఆయనకు ఓ బహుమతిని అందించింది. ఈ మేరకు ఓ ట్వీట్ చేసి.. తన హెల్త్ ప్రాబ్లమ్ గురించి కూడా బయటపెట్టింది. 'గత రెండు రోజులుగా ఫుడ్ ఎలర్జీతో బాధపడుతున్నాను. దీని వల్ల ఫైబ్రోమయాల్జియా అనే వ్యాధి కూడా వచ్చింది. అందుకే శరీరం ఇలా ఉబ్బిపోయింది. యాంటీ బయోటిక్స్ కూడా వాడుతున్నా కదా. అందుకే ఇలా' అని పూనమ్ కౌర్ ట్విటర్ లో రాసుకొచ్చింది. పూనమ్ కౌర్ ఎప్పుడూ పవన్ కల్యాణ్, త్రివిక్రమ్ పై సెటైర్స్ వేస్తూ ట్వీట్స్ పెడుతూ ఉంటుంది. ఆ మధ్య మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ లోనూ త్రివిక్రమ్ పై ఫిర్యాదు చేసింది. కానీ ఇదెక్కడ వరకు వచ్చిందో తెలీదు. ప్రస్తుతానికైతే పూనమ్.. నటిగా ఎలాంటి సినిమాలు చేయట్లేదు. కాకపోతే అప్పుడప్పుడు వార్తల్లో నిలుస్తూ ఉంటుంది.






## శిల్పా శిరోద్కర్‌కు
# కొవిడ్..
## సోషల్ మీడియాలో పోస్ట్!

హిందీ బిగ్‌బాస్ షోలో ఫ్యాన్స్‌ను మెప్పించిన బాలీవుడ్ నటి శిల్పా శిరోద్కర్. హిందీ బిగ్‌బాస్ 18వ సీజన్‌లో టాప్ 5లో ఉంటుందనుకున్న ఆమె వంద రోజుల తర్వాత గ్రాండ్ ఫినాలే వీక్ మధ్యలోనే ఎలిమినేట్ అయింది. ఫైనలిస్ట్ అయ్యే అవకాశాన్ని ఒక్క అడుగు దూరంలోనే మిస్ చేసుకుంది. ఈ షో ద్వారా శిల్పా మరింత ఫేమస్ అయ్యారు. అయితే శిల్పా శిరోద్కర్ తాజాగా చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది. తనకు కరోనా పాజిటివ్‌గా వచ్చిందని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. ఇది చూసిన అభిమానులు స్టే సేఫ్.. టేక్ కేర్ మేడమ్ అంటూ పోస్టులు పెడుతున్నారు. ఈ పోస్ట్‌పై ఆమె సిస్టర్, మహేశ్ భార్య నమ్రతా శిరోద్కర్ సైతం స్పందించింది. గెట్ వెల్ సూన్ అంటూ సోషల్ మీడియాలో రిప్లై ఇచ్చింది.



# క్రీడా వార్తలు SPORTS NEWS





# ఎస్ఆర్‌హెచ్‌కు భారీ షాక్..
## స్టార్ ప్లేయర్‌కు కరోనా

ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నామమాత్రమైన పోరుకు సిద్ధమైంది. ఈ మెగా టోర్నీలో భాగంగా సోమవారం ఏక్నా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో ఎస్ఆర్‌హెచ్ తలపడనుంది. ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నిష్క్రమించిన ఎస్ఆర్‌హెచ్.. కనీసం మిగిలిన మ్యాచ్‌లోనైనా గెలిచి పరువు నిలబెట్టుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలో సన్‌రైజర్స్‌కు భారీ షాక్ తగిలింది. లక్నోతో మ్యాచ్‌కు ముందు ఆ జట్టు స్టార్ ఓపెనర్, ఆస్ట్రేలియా విధ్వంసకర వీరుడు ట్రావిస్ హెడ్ కరోనా బారిన పడ్డాడు. అతడు ఇంకా ఆస్ట్రేలియాలోనే ఉన్నాడు. దీంతో లక్నో మ్యాచ్‌కు హెడ్ దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఎస్ఆర్‌హెచ్ హెడ్ కోచ్ డేనియల్ వెట్టోరి ధ్రువీకరించాడు.

"ట్రావిస్ హెడ్‌కు దురదృష్టవశాత్తు కోవిడ్ 19 సోకింది. దీంతో అతడు భారత్‌కు చేరుకోవడం కాస్త ఆలస్యం కానుంది. అతడు సోమవారం భారత్‌కు రానున్నాడు. హెడ్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు. దీంతో లక్నోతో మ్యాచ్‌కు దూరంగా ఉండనున్నాడు. అతడు పూర్తిగా కోలుకుని తిరిగి మా తదుపరి మ్యాచ్‌కు అందుబాటులోకి వస్తాడని ఆశిస్తున్నామని" ప్రీ మ్యాచ్ కాన్ఫరెన్స్‌లో వెట్టోరి పేర్కొన్నాడు. కాగా భారత్‌పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఐపీఎల్ వారం పాటు వాయిదా పడిన విషయం విధితమే. ఈ క్రమంలో కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్‌తో పాటు హెడ్ తమ స్వదేశానికి వెళ్లిపోయారు. ఐపీఎల్ రీస్టార్ట్ కావడంతో కమ్మిన్స్ తిరిగి వచ్చినప్పటికి.. హెడ్ మాత్రం కరోనా కారణంగా కాస్త ఆలస్యంగా జట్టులో చేరనున్నాడు. ఈ సీజన్‌లో హైదరాబాద్ జట్టుకు మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. సోమవారం లక్నోతో, ఆ తర్వాత ఆర్‌సీబీ, కేకేఆర్‌తో మ్యాచులు ఆరెంజ్ ఆర్మీ ఆడనుంది.




# ఎస్ఆర్‌హెచ్ చేతిలో చిత్తు..
## ప్లే ఆఫ్స్ రేసు నుంచి లక్నో ఔట్

ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్ కథ ముగిసింది. ఈ మెగా టోర్నీలో భాగంగా ఏక్నా స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో లక్నో ఓటమి పాలైంది. దీంతో ఈ ఏడాది సీజన్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి పంత్ టీమ్ నిష్క్రమించింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన లక్నో నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 205 పరుగుల భారీ స్కోర్ చేసింది. లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్(39 బంతుల్లో 6 ఫోర్లు 4 సిక్స్‌లతో 65), మార్క్రమ్(38 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించగా.. నికోలస్ పూరన్(26 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 45) మెరుపులు మెరిపించాడు. ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో ఇషాన్ మలింగ రెండు వికెట్లు పడగొట్టగా.. దూబే, హర్షల్ పటేల్, నితీష్ కుమార్ రెడ్డి తలా వికెట్ సాధించారు.

**అభిషేక్ శర్మ విధ్వంసం..**

అనంతరం 206 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ కేవలం నాలుగు వికెట్లు మాత్రమే కోల్పోయి 18.2 ఓవర్లలో చేధించింది. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో అభిషేక్ శర్మ(20 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లతో 59) విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. క్లాసెన్(47), ఇషాన్ కిషన్(35), మెండిస్(32) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు.

# దిగ్వేష్ సింగ్ ఓవరాక్షన్.. ఇచ్చిపడేసిన అభిషేక్!




ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్ స్పిన్నర్ దిగ్వేష్ సింగ్ రథీ మరోసారి తన సెలబ్రేషన్స్‌లో అతి చేశాడు. ఈ మెగా టోర్నీలో భాగంగా ఏక్నా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడ్డాయి. 206 పరుగుల లక్ష్య చేధనలో ఎస్ఆర్‌హెచ్ ఓపెనర్ దూకుడుగా ఆడాడు. ఎస్ఆర్‌హెచ్ ఇన్నింగ్స్ 8వ ఓవర్ వేసిన రవి బిష్ణోయ్ బౌలింగ్‌లో అభిషేక్ ఏకంగా నాలుగు సిక్స్‌లతో 26 పరుగులు పిండుకున్నాడు. ఈ క్రమంలో అతడి దూకుడుకు కళ్లెం వేసేందుకు దిగ్వేష్ సింగ్‌ను లక్నో కెప్టెన్ ఎటాక్‌లోకి తీసుకొచ్చాడు. అయితే పంత్ నమ్మకాన్ని దిగ్వేష్ వమ్ము చేయలేదు. ఆ ఓవర్‌లో మూడో బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించి అభిషేక్ ఔటయ్యాడు. ఈ క్రమంలో దిగ్వేష్ సెలబ్రేషన్స్ శ్రుతిమించాయి. అభిషేక్ వైపు చూస్తూ కోపంగా ఇక ఆడింది చాలు తన నోట్ బుక్ సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. దీంతో డగౌట్‌కు వెళ్లేందుకు సిద్ధమైన అభిషేక్ మళ్లీ వెనక్కి వచ్చి దిగ్వేష్‌పై ఫైరయ్యాడు. అతడు కూడా అభిషేక్ వద్దకు పరిగెత్తుకుంటూ వచ్చి వాగ్వాదానికి దిగాడు. వెంటనే అంపైర్‌లు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది. కాగా ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటికే దిగ్వేష్ సింగ్‌పై బీసీసీఐ రెండు సార్లు కొరడా ఝుళిపించింది. ఓసారి అతడి మ్యాచ్ ఫీజులో 25 శాతం, మరోసారి 50 శాతం కోత బీసీసీఐ విధించింది.

# అవన్నీ రూమర్స్.. ఇంకా నిర్ణయం తీసుకోలేదు: బీసీసీఐ

భారత్‌పాక్ మధ్య ఉద్రిక్తల కారణంగా ఆసియా క్రికెట్ కౌన్సిల్ నిర్వహించే అన్ని క్రికెట్ టోర్నీలకు దూరంగా ఉండాలని బీసీసీఐ నిర్ణయం తీసుకున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్‌కు చెందిన మంత్రి మొహిసిన్ నఖ్వీ ఏసీసీ చైర్మెన్‌గా ఉండడంతో భారత క్రికెట్ బోర్డు ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తాజాగా ఈ విషయంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. ఆసియా కప్, మహిళల ఎమర్జింగ్ జట్ల ఆసియా కప్ నుండి వైదొలుగుతున్నట్లు వచ్చిన వార్తలను ఆయన ఖండించారు.

"ఆసియా కప్, మహిళల ఎమర్జింగ్ జట్ల ఆసియా కప్ రెండు ఏసీసీ ఈవెంట్‌లలోనూ పాల్గొనకూడదని బీసీసీఐ నిర్ణయం తీసుకుందన్న వార్తలు మా దృష్టికి వచ్చాయి. ఈ రోజు ఉదయం నుంచి ఇదే ప్రచారం జరుగుతోంది. ఇవన్నీ నిరాధరమైన వార్తలు. బీసీసీఐ ఇప్పటివరకు తదుపరి ఏసీసీ ఈవెంట్‌లకు సంబంధించి ఎలాంటి చర్చలు జరపలేదు. అదేవిధంగా ఏసీసీకి ఎటువంటి లేఖ కూడా బీసీసీఐ రాయలేదు.ప్రస్తుతం మా దృష్టింతా ఐపీఎల్, తదుపరి ఇంగ్లండ్ సిరీస్‌లపైనే మాత్రమే ఉంది. ఆసియా కప్ లేదా ఏదైనా ఇతర ఏసీసీ ఈవెంట్‌పైన ఎటువంటి నిర్ణయం తీసుకున్న భారత క్రికెట్ బోర్డు ప్రెస్‌నోట్ కచ్చితంగా విడుదల చేస్తోంది" అని దేవజిత్ సైకియా టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దేవజిత్ సైకియా పేర్కొన్నారు. కాగా మహిళల ఎమర్జింగ్ టీమ్స్ ఆసియా కప్ వచ్చే నెలలో జరగనుంది. ఆ తర్వాత సెప్టెంబర్‌లో పురుషుల ఆసియా కప్ టోర్నీని నిర్వహించనున్నారు. గత ఆసియాకప్ టోర్నీ శ్రీలంక, పాక్‌ల వేదికగా హైబ్రిడ్ మోడల్‌లో జరిగింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com